https://epaper.dksaardyamlochaatimpu.com




E-mail: dkchaatimpu80@gmail.com RNI. NO. APTEL/2008/26737

# డీకే సార్థ్యంలో చాటింపు

తెలంగాణ దిన పత్రిక

హైదరాబాద్ | సంపుటి : 17 సంచిక : 312 | ఎడిటర్ : పూసాల శ్రీనివాస్ | ఆదివారం 13 - 9 - 2026 | పేజీలు : 8 వెల : రూ.1/-

## 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే తెలంగాణ లక్ష్యం: శ్రీధర్ బాబు

### హైదరాబాద్ ప్రపంచ స్థాయి మెట్రోపాలిటన్ సిటీగా ఎదిగిందన్న మంత్రి



**హైదరాబాద్, సెప్టెంబర్, 12:** హైదరాబాద్ నగరంలో రాబోయే 20 నుంచి 30 ఏళ్ల భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా వికేంద్రీకృత నగర పాలనను అందుబాటులోకి తెస్తున్నట్లు తెలంగాణ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఇందుకోసమే ప్రత్యేకంగా 'క్యూర్ యాక్ట్- 2026' శాసనాన్ని రూపొందించినట్లు శాసనసభలో ఆయన వెల్లడించారు. నగర పరిపాలనను మరింత వేగవంతంగా, పారదర్శకంగా, ప్రజా సమన్వయంతో ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా తీర్చిదిద్దడమే ఈ కొత్త చట్టం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. 'తెలంగాణ రైజింగ్ 2047' పాలసీ విజన్‌లో భాగంగా 2034 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల స్థాయికి తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని చాటిచెప్పారు.

చార్మినార్ నుంచి హైటెక్ సిటీ వరకు, మూసీ తీరం నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వరకు ప్రపంచ స్థాయి మెట్రోపాలిటన్ నగరంగా హైదరాబాద్ ఎదిగిందని మంత్రి కొనియాడారు. ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఏరోస్పేస్, డేటా సెం టర్లు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకుప్రధాన కేంద్రంగా మారిన హైదరాబాద్... రాష్ట్ర ఆర్థిక రంగానికి ప్రధాన గ్రోత్ ఇంజన్ అని గుర్తుచేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర జీఎస్‌డీపీ 10.7 శాతం వృద్ధితో రూ. 17.82 లక్షల కోట్లకు చేరిందని...

ఇందులో క్యూర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలే సింహభాగం భాగస్వామ్యం వహిస్తున్నాయని ఆర్థిక గణాంకాలతో వివరించారు. ప్రస్తుతం నగరం ఔటర్ రింగ్ రోడ్డు వరకు వేగంగా విస్తరించిన నేపథ్యంలో మౌలిక సదుపాయాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఓఆర్ఆర్ పరిధికి ప్రత్యేక కార్యనిర్వాహక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు ప్రకటించారు.

తాగునీటి సరఫరా, మురుగునీటి శుద్ధి, ప్రజా రవాణా, ట్రాఫిక్ నివారణ, చెత్త నిర్వహణ, వరదల నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ వంటి కీలక శాఖలను ఒకే గొడుగు కిందకు తెచ్చి నగరపాలనను అంతర్జాతీయ ప్రమాణాలకు చేర్చడమే సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తమ ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు.

## అణిచివేతకు తలొగ్గం.. ఢిల్లీ వేదికగా

### అమెరికా, ఇజ్రాయెల్‌కు ఇరాన్ అధ్యక్షుడి మాస్ వార్నింగ్..!



**న్యూఢిల్లీ, సెప్టెంబర్, 12:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పజెష్కియాన్ మరోసారి అమెరికా, ఇజ్రాయెల్‌కు గట్టి హెచ్చరికలు జారీ చేశారు. భారత్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడిన ఆయన.. అగ్రరాజ్యాల ఒత్తిళ్లకు, ఆధిపత్య ధోరణికి ఇరాన్ ఎట్టి పరిస్థితుల్లోనూ తలొగ్గబోదని స్పష్టం చేశారు. తమ జాతీయ ప్రయోజనాలను కాపాడుకునేందుకు ఇరాన్ బలంగా నిలబడుతుందని తెలిపారు. మతపెద్దలు, మేధావులు, విద్యావేత్తలు, వ్యాపార ప్రముఖులతో జరిగిన సమావేశంలో పజెష్కియాన్ పశ్చిమాసియా పరిస్థితులపై ఇరాన్ వైఖరిని వివరించారు. శాంతియుత సహజీవనానికి తాము కట్టుబడి ఉన్నామని చెబుతూనే.. ఇరాన్ సమాజంలో విభేదాలను సృష్టించేందుకు విదేశీ శక్తులు చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొడతామని అన్నారు. అమెరికా, ఇజ్రాయెల్‌పై నేరుగా విమర్శలు చేసిన పజెష్కియాన్.. బెదిరింపులు, ఒత్తిళ్లకు తాము భయపడబోమని పేర్కొన్నారు. తమపై ఒత్తిడి పెంచితే అందుకు తగినవిధంగా స్పందిస్తామని స్పష్టం చేశారు. అమెరికా, ఇజ్రాయెల్ సైన్యాలను ఆయన తీవ్రంగా విమర్శిస్తూ.. ఇరాన్‌పై దాడులు, సాధారణ ప్రజలపై జరుగుతున్న నష్టాన్ని ప్రస్తావించారు. ఆసుపత్రులు, మౌలిక వసతులు, ప్రజల జీవనోపాధిని లక్ష్యంగా చేసుకోవడం కంటే ఇరాన్ సైనికులను ఎదుర్కోవాలని పజెష్కియాన్ అన్నారు. సరఫరాల కొరతను సృష్టించడం ద్వారా ఇరాన్ ప్రజలను లొంగదీసుకోవచ్చని అమెరికా, ఇజ్రాయెల్ భావిస్తున్నాయని.. కానీ ఇరాన్ ప్రజలు ఎప్పటికీ లొంగరని ఆయన స్పష్టం చేశారు. అమెరికా, ఇజ్రాయెల్ చేస్తున్న చర్యలను అదుపు లేని అడవి గుర్రంపై స్వారీ చేయడంతో పజెష్కియాన్ పోల్చారు. ఇలాంటి విధానం చివరకు విధ్వంసానికి దారితీస్తుందని హెచ్చరించారు. దేవుడు ఇరానీయులు, చైనీయులు, భారతీయులు, ఇతర ప్రజలను సృష్టించాడని.. అందరూ పరస్పరం కలిసి జీవించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అణచివేతకు తలొగ్గకుండా బాధితులకు మద్దతు కొనసాగిస్తామని అన్నారు.

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై లైంగిక వేధింపుల కేసులు పెట్టడం దుర్మార్గం..కేటీఆర్



**హైదరాబాద్, సెప్టెంబర్, 12:** అసెంబ్లీ ప్రవేశ ద్వారం వద్ద చోటుచేసుకున్న ఉద్రిక్తతల నేపథ్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై లైంగిక వేధింపుల కేసులు నమోదు చేయడాన్ని కేటీఆర్ తీవ్రంగా తప్పుపట్టారు. రాష్ట్రంలో ఉన్న ఒక చవకబారు మంత్రి తన పరిధిలోని పోలీసులను ఉపయోగించుకుని ప్రజాప్రతినిధులపై ఈ తరహా కేసులు పెట్టించారని ఆరోపించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో ఓ ట్వీట్ చేశారు. "తెలంగాణ చవకబారు మంత్రి, అసెంబ్లీ ప్రవేశ ద్వారం వద్ద జరిగిన గొడవ నేపథ్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై తన పోలీసులతో లైంగిక వేధింపుల కేసు నమోదు చేయించారు!!! చట్టాన్ని దిగ్భ్రాంతికరంగా దుర్వినియోగం చేయడం. ఈ పనికిమాలిన కేసులను మేము తప్పకుండా న్యాయస్థానంలో ఎదుర్కొంటాం. కానీ తెలంగాణడీజీపీ గారిని ఒకటి అడగాలనుకుంటు న్నాను. హైదరాబాద్‌లోజరిగిన మిస్ వరల్డ్ పోటీల సమయంలో తనతో అసభ్యంగా ప్రవర్తించిన కాంగ్రెస్ నాయకులపై మిస్ ఇంగ్లాండ్ చేసిన లైంగిక వేధింపుల ఆరోపణల సంగతేంటి? తెలంగాణపోలీసులు నిందితు లను కాపాడటం కొనసాగిస్తారా? రాహుల్ గాంధీ గారూ, ఏమైనా సమాధా నాలు ఉన్నాయా?" అంటూ ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు.

## బర్తరఫ్ తర్వాత కీలక పరిణామం.. కొండా సురేఖకు ఢిల్లీ నుంచి పిలుపు

### మంత్రి పదవి కోల్పోయిన కొండా సురేఖకు ఢిల్లీ నుంచి పిలుపు
### వెంటనే రావాలంటూ కాంగ్రెస్ అధిష్ఠానం పెద్దల నుంచి సందేశం
### కేబినెట్ స్థాయి పదవి ఇచ్చే యోచనలో అధిష్ఠానం ఉన్నట్లు సమాచారం
### సురేఖతో నేరుగా మాట్లాడిన తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్




**హైదరాబాద్, సెప్టెంబర్, 12:** మంత్రి పదవి నుంచి బర్తరఫ్ అయిన కొండా సురేఖ వ్యవహారంలో అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. ఆమెకు కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి ఢిల్లీకి రావాల్సిందిగా పిలుపు అందింది. వెంటనే బయలుదేరి రావాలని పార్టీ పెద్దల నుంచి ఆమెకు సందేశం అందినట్లు తెలుస్తోంది. మంత్రివర్గం నుంచి తొలగించిన మరుసటి రోజే హైకమాండ్ రంగంలోకి దిగడం తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తి రేపుతోంది. నిన్న తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, కొండా సురేఖతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడారు. పార్టీ నిర్ణయాన్ని గౌరవించాలని, అధిష్ఠానం అండగా ఉంటుందని ఆమెకు హామీఇచ్చినట్లు సమాచారం. ఈ సంభాషణ జరిగిన కొద్ది గంటల్లోనే ఢిల్లీ నుంచి పిలుపు రావడం గమనార్హం. మంత్రి పదవి కోల్పోయి అసంతృప్తితో ఉన్న కొండా సురేఖను బుజ్జగించేందుకే అధిష్ఠానం ఈ చర్యలు చేపట్టినట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఆమెకు కేబినెట్ స్థాయి పదవిని అప్పగించే యోచనలో కాంగ్రెస్ పెద్దలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అధిష్ఠానం పిలుపు మేరకు కొండా సురేఖ ఢిల్లీ పర్యటన తర్వాత ఈ వ్యవహారంపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## మాపై ప్రైవేట్ పెత్తనం వద్దు.. 'సీఎం రేవంత్ సార్ న్యాయం చేయండి'



**హైదరాబాద్, సెప్టెంబర్, 12:** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలో ఇంటింటి చెత్త సేకరణను ప్రైవేట్ ఏజెన్సీలకు కట్టబెట్టాలనే ఆలోచనను ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ స్వచ్ఛ ఆటో కార్మికులు శనివారం చేపట్టిన అసెంబ్లీ ముట్టడి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. గతంలో శాసనమండలిలో చెత్త సేకరణ ప్రైవేటీకరణపై మంత్రి శ్రీధర్ బాబు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ కార్మికులు ఈ ఆందోళన కార్యక్రమానికి పిలుపునిచ్చారు. తమపై ఎలాంటి ప్రైవేట్ ఏజెన్సీల పెత్తనం అవసరం లేదని, దశాబ్దాలుగా నమ్ముకున్న ఉపాధిని దెబ్బతీయవద్దని స్పష్టం చేశారు. చేతుల్లో ప్లకార్డులు పట్టుకుని అసెంబ్లీ వైపు దూసుకువచ్చిన కార్మికులను పోలీసులు అడ్డుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన స్వచ్ఛ ఆటో కార్మికులు రోడ్డుపైనే బైఠాయించి, రవాణాను అడ్డుకున్నారు. కొందరు కార్మికులు రోడ్డుపై అడ్డంగా పడుకుని నిరసన తెలపగా, మరికొందరు అసెంబ్లీ ఆవరణలోకి వెళ్లేందుకు యత్నించారు. ఆందోళనకారులను పోలీసులు తీవ్రంగా నిరోధించి, పలువురు కార్మికులను అరెస్ట్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ, "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సార్ మా సమస్యను గుర్తించి వెంటనే జోక్యం చేసుకోవాలి. మాకు న్యాయం చేయాలి. ప్రైవేట్ సంస్థలకు చెత్త సేకరణ బాధ్యతలు అప్పగిస్తే వేలాది కుటుంబాలు రోడ్డున పడతాయి" అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకునే వరకు తమ పోరాటం ఆగదని ' హెచ్చరించారు.

## చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ కి ఘన స్వాగతం



**న్యూఢిల్లీ, సెప్టెంబర్, 12:** 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనేందుకు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ శనివారం న్యూఢిల్లీకి చేరుకున్నారు. విమానాశ్రయంలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద ఆయనకు స్వాగతం పలికారు. పొరుగున ఉన్నవారితో స్నేహంగా ఉండటం, దీర్ఘకాల మైత్రిపై దృష్టిసారించడం వంటి అంశాలను అందులో ప్రస్తావించింది. "ఇరు దేశాల నాయకుల వ్యూహాత్మక మార్గదర్శకత్వంలో భారత్‌తో కలిసి పనిచేయడానికి చైనా సిద్ధంగా ఉంది. పరస్పర సహకారాన్ని పెంపొందించుకోవడంతో పాటు విభేదాలను పరిష్కరించుకోవడానికి మేం కృషి చేస్తున్నాం" అని భారత్‌లోని చైనా రాయబారిగ్జు ఫీహాంగ్ ఎక్స్ వేదికగా ఈ మెసేజ్‌ను పోస్టు చేశారు.

## మూతపడ్డ సౌదీ చమురు పైప్‌లైన్.. భారత్‌కు పెరిగిన కష్టాలు!

### హోర్ముజ్ తర్వాత మరో షాక్..




**న్యూఢిల్లీ, సెప్టెంబర్, 12:** అమెరికా-ఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధం వల్ల ఇప్పటికే ప్రపంచంలోనే అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధి మూతపడి చమురు సరఫరా తీవ్రంగా దెబ్బతింది. అంతలోనే ముడి చమురు ధరకు రెక్కలొచ్చి బ్యారెల్ ధర ఏకంగా 100 డాలర్ల మార్కును దాటేసింది. నిన్న టికైతే ఇది 109 డాలర్ల రికార్డు స్థాయికి చేరుకుంది. ఈ ఉద్రిక్తతల నడుమ హోర్ముజ్ జలసంధి నుంచి కాకుండా, ప్రత్యామ్నాయంగా తన పశ్చిమ తీరంలో ఉన్న యంబూ పోర్టుకు చమురు తరలించేందుకు సౌదీ అరేబియా సుమారు 1,200 కిలోమీటర్ల పొడవైన ఈస్ట్-వెస్ట్ పైప్‌లైన్‌ను ఉపయోగిస్తూ వచ్చిందిభారత్ సహా ఆసియా దేశాలకు ఇన్నాళ్లూ చమురు సురక్షితంగా అందుతోంది. అయితే, తాజాగా రియాద్, మదీనా ప్రాంతాల్లో గురువారం ఉదయం ఈ దాడులు జరిగాయి. మదీనాకు దక్షిణంగా ఉన్న పైప్‌లైన్ భాగం నుంచి దట్టమైన నల్లటి పొగలు వస్తున్నట్లు శాటిలైట్ చిత్రాలు కూడా స్పష్టం చేస్తున్నాయి. ఈ దాడిలో కొందరు గాయపడటంతో పాటు పైప్‌లైన్‌కు నష్టం వాటిల్లడంతో ప్రస్తుతం అధికారులు నష్ట తీవ్రతను అంచనా వేస్తున్నారు. ఈ ఘటనపై ఇప్పటివరకు ఏ సంస్థా అధికారికంగా బాధ్యత వహించకపోయినప్పటికీ, ఇరాన్ మద్దతు ఉన్న మిలీషియా గుంపులు క్రియాశీలంగా ఉన్న ఇరాక్ నుంచే ఈ దాడి జరిగిందని బాగ్దాద్, రియాద్ వర్గాలు సూచిస్తున్నాయి. సాధారణంగా ఈ ఈస్ట్-వెస్ట్ పైప్‌లైన్ ద్వారా రోజుకు 40 నుంచి 50 లక్షల బ్యారెళ్ల ముడి చమురు ఎగుమతి అవుతుంది, ఇది ప్రపంచ మొత్తం చమురు సరఫరాలో దాదాపు 4 నుంచి 5 శాతానికి సమానం. హోర్ముజ్ సంక్షోభంతో ఇప్పటికే చమురు కొరతతో అల్లాడుతున్న ప్రపంచ ఇంధన మార్కెట్‌కు ఈ ప్రత్యామ్నాయ మార్గం మూతపడటం మరో కోలుకోలేని పెద్ద దెబ్బగా మారింది.

## బ్రిక్స్ కూటమి ఎవరికీ వ్యతిరేకం కాదు: ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ, సెప్టెంబర్, 12:** ఢిల్లీ వేదికగా జరుగుతున్న 18వ బ్రిక్స్ (దీ=×జూ) సదస్సు ప్రారంభ సమావేశంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ కీలక ప్రసంగం చేశారు. బ్రిక్స్ కూటమి ఏ రకమైన పాశ్చాత్య లేదా ఇతర వర్గానికి వ్యతిరేకంగా పనిచేసే వేదిక కాదని, అందరినీ కలుపుకొనిపోయే భాగస్వామ్య వేదిక అని ప్రధాని స్పష్టం చేశారు. భారత్ బ్రిక్స్ అధ్యక్షత వహించడంలో 'మానవాభివృద్ధే కీలకం' అనే నమూనాను అనుసరిస్తోందన్నారు. తద్వారా ఈ కూటమి సేవలను సామాన్య ప్రజలకు చేరువ చేయడమే తమ ప్రాధాన్యత అని మోదీ తెలిపారు. మారుతున్న గ్లోబల్ పరిణామాలకు అనుగుణంగా ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి (ఖచీూజ), ఇతర ప్రపంచ సంస్థలలో తక్షణ సంస్కరణలు చేపట్టాలని మోదీ పిలుపునిచ్చారు. గ్లోబల్ సౌత్ (అభివృద్ధి చెందుతున్న దేశాల) స్వరాన్ని మరింత బలపరచాలని కోరారు. బ్రిక్స్ ప్రారంభమై రెండు దశాబ్దాలు పూర్తిచేసుకున్న సందర్భంలో, కూటమి సాధించిన ఏకాభిప్రాయాన్ని కేవలం మాటలకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో స్పష్టమైన ఫలితాలు సాధించే దిశగా తీసుకెళ్లాలని మోదీ సూచించారు. అన్ని నిర్ణయాలు, కార్యక్రమాలు సజావుగా ముందుకు సాగేందుకు బ్రిక్స్ లోపల ఒక ప్రత్యేక 'కంటిన్యూటీ అండ్ ఇంప్లిమెంటేషన్ మెకానిజం' ఏర్పాటు చేయాలని మోదీ ప్రతిపాదించారు.

# పర్యావరణాన్ని కాపాడుకోవడానికి వినాయక చవితికి మట్టి విగ్రహాలనే వాడాలి:ఆలయ ఈ.వో లావణ్య

## పాటలు పాడుతూ ఆలయానికి విచ్చేసిన భక్తులకు అవగాహన సంగీత దర్శకులు, గాయకులు




ఎల్బీనగర్ సెప్టెంబర్ 12 (డీకే చాటింపు) తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణాన్ని కాపాడుకోవడానికి వినాయక చవితికి మట్టి విగ్రహాలనే వాడాలనే సదుద్దేశంతో కర్మన్ ఘాట్ హనుమాన్ ఆలయంలో సంగీత దర్శకులు, గాయకులు ప్రజలకు వీ డీ శ్రీకాంత్ ఆధ్వర్యంలో నేపథ్య గాయకులు కుమారి మహతి, అఖిల్ చంద్ర , మేఘన నాయుడు అద్భుతంగా పాటలు పాడుతూ ఆలయానికి విచ్చేసిన భక్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి వారు నిర్వహించగా. తెలంగాణ దేవాదాయ ధర్మాదాయ శాఖ వారు ప్రోత్సహించారు. ఇక్కడ అవకాశం కల్పించినందుకు ఆలయఈ వో లావణ్యకి కళాకారులు ధన్యవాదాలు తెలియ చేసారు.

ప్రజలు మట్టి వినాయ కుణ్ణి ప్రతిష్టించి పూజించి నీటిలో నిమజ్జనం చేయడం ద్వారా కాలుష్యాన్ని నియంత్రిచాలని విజ్ఞప్తి చేశారు.తదుపరి భక్తులకు మట్టి వినాయకుణ్ణి అందచేశారు . భక్తులు మట్టివినాయకున్నే పూజిస్తామని ప్రమాణం చేసారు. వశీ లావణ్య భక్తులు మట్టి వినాయకుణ్ణి ప్రతిష్టించి పూజించి నీటిలో నిమజ్జనం చేయడం ద్వారా కాలుష్యాన్ని నియంత్రిచాలని విజ్ఞప్తి చేశారు

# ఏపీలో ఉమ్మడి... తెలంగాణలో ఒంటరి

**హైదరాబాద్:** తెలంగాణలో భారతీయ జనతా పార్టీ ఒంటరిగానే పోటీ చేస్తుందని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు ప్రకటించారు. ఈ ప్రకటన తీవ్ర రాజకీయ కలకలానికి దారితీసింది. ఆంధ్రాలో కూటమిగా కలసి పనిచేస్తున్నప్పటికీ, తెలంగాణలో పొత్తుల ఆశలతో ఉన్న జనసేన శ్రేణులకు ఈ వ్యాఖ్యలు గుండెల్లో రాయిపడ్డట్టే అయ్యాయి. దీనిపై తెలంగాణ జనసేన ఇన్‌చార్జ్ నేమూరి శంకర్ గౌడ్ తక్షణమే స్పందిస్తూ.. పొత్తుల అంశంపై నిర్ణయం తీసుకోవాల్సింది రామచందర్ రావు కాదని, ఢిల్లీలోని బీజేపీ హైకమాండ్ , జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మాత్రమేనని స్పష్టం చేశారు. ఒకవేళ బీజేపీ రాబోయే రోజుల్లో ఒంటరిగానే వెళ్లాలని భావిస్తే, జనసేన కూడా తెలంగాణలో సొంతంగానే బరిలోకి దిగుతుందని ఆయన కుండబద్దలు కొట్టారు.గత అసెంబ్లీ ఎన్నికల అనుభవాలను పరిశీలిస్తే.. తెలంగాణలో బీజేపీ–జనసేన కలిసి పొత్తుతో పోటీ చేసినప్పటికీ ఆశించిన ఫలితాలు రాలేదు. పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించిన 8 స్థానాల్లో ఒక్కచోట కూడా బోణీ కొట్టలేకపోయింది. తాండూరు నుంచి పోటీ చేసిన శంకర్ గౌడ్‌తో సహా పోటీ చేసిన అభ్యర్థులందరూ డిపాజిట్లు కోల్పోయిన పరిస్థితి నెలకొంది. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ద్వారా సాధించిన రికార్డు స్థాయి విజయం, పవన్ కళ్యాణ్‌కు పెరిగిన ఇమేజ్‌ను ఆసరాగా చేసుకుని తెలంగాణలో బలపడాలని చూస్తున్న జనసేన ఆశలపై.. బీజేపీ రాష్ట్ర నేతల ఒంటరి పోరు వ్యాఖ్యలు పెద్ద దెబ్బగానే భావించవచ్చు. జనసేనను దూరం పెట్టి తెలంగాణలో ఒంటరిగా పోటీ చేయాలనే వ్యూహం బీజేపీకి ఏమేరకు మేలు చేస్తుందనేది పెద్ద ప్రశ్నార్థకమే. తెలంగాణలో బీఆర్ఎస్‌ను వెనక్కి నెట్టి, అధికార కాంగ్రెస్‌కు ఏకైక ప్రత్యామ్నాయంగా ఎదగాలని కమలనాథులు భావిస్తున్నారు. ఈ క్రమంలో పొత్తులు పెట్టుకుంటే పార్టీ స్వయం సమృద్ధి దెబ్బతింటుందని, ఇతర పార్టీల ఇమేజ్‌పై ఆధారపడే పరిస్థితి వస్తుందని బీజేపీ భావిస్తోంది. కానీ, గ్రేటర్ హైదరాబాద్ , ఆంధ్రా సరిహద్దు జిల్లాలైన ఖమ్మం, నల్గొండ, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు ఉన్న అశేష అభిమాన గణాన్ని, ఆంధ్రా సెటిలర్ల ఓటు బ్యాంకును పూర్తిగా విస్మరించడం బీజేపీకి అంత సులభం కాదు.




కాంగ్రెస్ బలమైన పోటీ ఇస్తున్న ప్రస్తుత తరుణంలో ఓట్ల చీలిక బీజేపీకే నష్టం చేకూర్చే ప్రమాదం ఉంది.రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరనే సూత్రం ఇక్కడ కూడా వర్తిస్తుంది. ఇప్పుడు స్థానిక నేతలు ఎంతగా ఒంటరి పోరు అని చెబుతున్నా.. అసలు ఎన్నికల సమయం దగ్గరపడేసరికి కేంద్ర బీజేపీ పెద్దలు పవన్ కళ్యాణ్‌తో మాట్లాడి పొత్తులపై తుది నిర్ణయం తీసుకునే అవకాశాలను కొట్టిపారేయలేం. ఒకవేళ పొత్తు కుదరకపోతే తెలంగాణలో జనసేన ఉనికి కాపాడుకోవడానికి ఒంటరిగా పోటీ చేయక తప్పదు. ఏది ఏమైనా, అధిష్ఠానాలు ఇంకా పెదవి విప్పకముందే లోకల్ లీడర్లు చేస్తున్న ఇలాంటి ప్రకటనలు గ్రేటర్ , తెలంగాణవ్యాప్తంగా ఉన్న జనసేన శ్రేణులను గందరగోళంలో పడేశాయి.

# ఎంఐఎంలో జరుగుతోంది..?

హైదరాబాద్: హైదరాబాద్ రాజకీయాల్లో తిరుగులేని పట్టున్న ఆల్ ఇండియా మజ్లిస్–ఎ–ఇత్తెహాదుల్ ముస్లిమీన్ పార్టీలో తాజా పరిణామాలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. లైంగిక దుష్ప్రవర్తన ఆరోపణలతో కూడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పార్టీ నుంచి బహిష్కరణకు గురైన ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్ వ్యవహారం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి తప్పించడమే కాకుండా, ఎమ్మెల్సీ పదవికి కూడా తక్షణమే రాజీనామా చేయాలని అధిష్ఠానం ఆదేశించినప్పటికీ, ఆయన ఇంకా రాజీనామా సమర్పించకపోవడం తీవ్ర ఉత్కంఠకు దారితీస్తోంది. పార్టీ ప్రతిష్టను కాపాడుకునేందుకు ఎంఐఎం నాయకత్వం రహ్మత్ బేగ్‌పై వెంటనే బహిష్కరణ వేటు వేసి, శాసనమండలి సభ్యత్వానికి రాజీనామా చేయాలని ఆదేశించింది. అయితే, ఆయన మాత్రం మండలి చైర్మన్‌కు రాజీనామా లేఖను సమర్పించడానికి ఏమాత్రం సుముఖంగా లేరన్న వార్తలు రాజకీయ వర్గాల్లో జోరుగా వినిపిస్తున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం నుంచే ఆయన అజ్ఞాతంలోకి వెళ్లడం, తన ఫోన్లను స్విచ్ఛాఫ్ చేసుకోవడంతో పరిస్థితి మరింత జటిలంగా మారింది. పార్టీ అధిష్ఠానం ఒత్తిడి తెస్తున్నప్పటికీ, ఆయన స్వచ్ఛందంగా పదవిని వదులుకోవడానికి సిద్ధంగా లేరనే సంకేతాలు వెలువడుతున్నాయి.ఈ వివాదం తీవ్రరూపం దాల్చడంతో రహ్మత్ బేగ్ ఒకవీడియో ద్వారా తన వాదనను వినిపించారు. తనపై వచ్చిన ఆరోపణలను ఆయన పూర్తిగా ఖండించారు. తనను, పార్టీని రాజకీయంగా దెబ్బతీసేందుకు కొందరు ఉద్దేశపూర్వకంగానే ఏఐ ఉపయోగించి మార్ఫింగ్ వీడియోలను సృష్టించి ప్రచారం చేశారని ఆరోపించారు. ఈ వ్యవహారంతో పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీకి గానీ, చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీకి గానీ లేదా ఎంఐఎం పార్టీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ కుట్రపై న్యాయపోరాటం చేస్తానని చెబుతూ ఇప్పటికే పోలీసులకు అధికారికంగా ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు





చేసి విచారణ చేపట్టారు.సాధారణంగా ఎంఐఎం అధిష్ఠానం ఆదేశిస్తే నాయకులు ఎదురుచెప్పే పరిస్థితి ఉండదు.

కానీ, రహ్మత్ బేగ్ రాజీనామా విషయంలో నాన్చుడు ధోరణి ప్రదర్శించడం పార్టీ కేడర్‌తో పాటు రాజకీయ విశ్లేషకులను సైతం ఆశ్చర్యపరుస్తోంది. ఒకవేళ బేగ్ స్వచ్ఛందంగా రాజీనామా చేయకపోతే, పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం లేదా అనర్హత వేటు కోసం మండలి చైర్మన్‌ను ఎంఐఎం ఆశ్రయిస్తుందా? లేక అంతర్గతంగా ఆయనపై ఒత్తిడి తెచ్చి రాజీనామా చేయిస్తుందా? అనేది ప్రస్తుతానికి ప్రశ్నార్థకంగా మారింది. రహ్మత్ బేగ్ సోషల్ మీడియా ఖాతాలను పరిశీలిస్తే, ఇటీవల ఆయన సౌదీ అరేబియాలో ఉమ్రా తీర్థయాత్రకు సంబంధించిన పోస్టు తప్ప ఎలాంటి తాజా అప్‌డేట్‌లు లేకపోవడం గమనార్హం.మొత్తానికి, పాతబస్తీ రాజకీయాల్లో రహ్మత్ బేగ్ ఎపిసోడ్ ఎంఐఎం అధిష్ఠానానికి పెద్ద పరీక్షగా మారింది. ఆయన రాజీనామా లేఖ చైర్మన్‌కు చేరుతుందా లేదా న్యాయపరమైన, రాజకీయపరమైన పోరుకు ఆయన సిద్ధపడుతున్నారా అనేది రానున్న 24 నుంచి 48 గంటల్లో స్పష్టమయ్యే అవకాశం ఉంది.

# 172 దేశాలకు ఈ-వీసా వ్యవస్థ

**న్యూఢిల్లీ** భారత్‌ను సందర్శించే అంతర్జాతీయ ప్రయాణికులకు ప్రయాణ సౌలభ్యాన్ని మరింత పెంపొందించే దిశగా కేంద్ర ప్రభుత్వం అత్యంత కీలకమైన నిర్ణయం తీసుకుంది. పంజాబ్‌లోని భారత్–పాకిస్థాన్ సరిహద్దులో ఉన్న ప్రముఖ అట్టారీ ల్యాండ్ పోర్టుతో పాటు మరో 10 అంతర్జాతీయ కేంద్రాలోకి ఈ–వీసా హోల్డర్లకు ప్రవేశాన్ని కల్పిస్తూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నూతన నోటిఫికేషన్ విడుదల చేసింది. తొమ్మిది ల్యాండ్ పోర్టులు, రెండు విమానాశ్రయాలను ఈ జాబితాలో చేర్చడంతో.. దేశవ్యాప్తంగా ఈ–వీసా ద్వారా భారత్‌లోకి ప్రవేశించడానికి అనుమతి ఉన్న అంతర్జాతీయ కేంద్రాల సంఖ్య ఏకంగా 88కి చేరింది.కేంద్రం తాజాగా విడుదల చేసిన సవరించిన నిబంధనల ప్రకారం.. విదేశీ ప్రయాణికులకు ప్రవేశం కల్పించే మొత్తం 88 కేంద్రాలలో 37 విమానాశ్రయాలు, 38 ఓడరేవులు, 13 ల్యాండ్ పోర్టులు ఉన్నాయి. అయితే కొత్తగా మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్, ఆంధ్రప్రదేశ్‌లోని ఆధ్యాత్మిక నగరం తిరుపతి విమానాశ్రయాలను కొత్తగా ఈ–వీసా జాబితాలో చేర్చారు. అలాగే కొత్తగా పంజాబ్‌లోని అట్టారీతో పాటు రక్సాల్, రూపైడిహా, జోగ్బానీలతో పాటు దర్రంగా, గెడే, ఘోజాదంగా, హరిదాస్‌పూర్, జైగావ్, డావ్కీ, మోరే సరిహద్దు ప్రాంతాలను ఈ–వీసా చెక్‌పోస్టులుగా గుర్తించారు.విదేశీయులకు ఈ–వీసా నిబంధనలను ఎంతగా సడలించినప్పటికీ.. పాకిస్థాన్ పౌరులకు మాత్రం ఈ సదుపాయాన్ని దూరంగా ఉంచారు. పాకిస్థానీ పాస్‌పోర్టు కలిగిన వ్యక్తులకు లేదా పాకిస్థానీ మూలాలు ఉన్న ప్రయాణికులకు భారత్ ఎలాంటి ఈ–వీసాలను మంజూరు చేయడం లేదు. అలాంటివారు సాధారణ పద్ధతిలోనే విదేశాల్లోని భారత రాయబార కార్యాలయాలు లేదా కాన్సులేట్ ద్వారా నేరుగా రెగ్యులర్ వీసాకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని ఈ–పోర్టల్ స్పష్టం చేసింది.భారత వీసా నిబంధనలను సులభతరం చేస్తూ 2014లో కేవలం 43 దేశాల పౌరుల కోసం ప్రారంభించిన ఈ–వీసా సేవలు.. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 172 దేశాల పౌరులకు అందుబాటులోకి వచ్చాయి. టూరిస్ట్, బిజినెస్, మెడికల్, స్టూడెంట్, గ్రూప్ ట్రావెల్, క్రూయిజ్, ట్రాన్సిట్, పర్వతారోహణతో సహా మొత్తం 17 వేర్వేరు సబ్–కేటగిరీలకు ఈ–వీసా సౌకర్యాన్ని వర్తింపజేస్తున్నారు. ఈ–వీసాల కోసం దాఖలయ్యే దరఖాస్తుల్లో దాదాపు 95 శాతానికి పైగా అప్లికేషన్లను కేవలం 72 గంటల వ్యవధిలోనే ప్రాసెస్ చేసి అధికారులు క్లియరెన్స్ ఇస్తున్నారు. ప్రస్తుతం అట్టారీ వంటి కీలక ల్యాండ్ పోర్టులతో పాటు భోపాల్, తిరుపతి విమానాశ్రయాలకు ఈ–వీసా ఎంట్రీ హోదా దక్కడంతో విదేశీ పర్యాటకులు, వ్యాపారవేత్తలకు రవాణా మరింత సులభతరం కానుంది.




# ఇరుకురోడ్ల విస్తరణ పనులు షురూ...



హైదరాబాద్, : హైదరాబాద్ కేబీఆర్ పార్క్ చుట్టూ అమలు చేస్తున్న వన్‌వే ట్రాఫిక్ విధానం 15 రోజులు పూర్తయిన నేపథ్యంలో హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించారు. ఫిల్మ్‌నగర్, జర్నలిస్ట్ కాలనీ, రోడ్ నంబర్ 45, జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు, కేబీఆర్ పార్క్ మెయిన్‌గేట్ ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను గమనించారు. బాటిల్‌నెక్స్ తొలగించేందుకు రోడ్ల విస్తరణ, మరమ్మతులు, డ్రైనేజీ సమస్యల పరిష్కారం, యుటిలిటీల తరలింపునకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.బంజారా హిల్స్‌లోని కేబీఆర్ పార్కు చుట్టూ వన్‌వే విధానం అమలవుతున్న సంగతి తెలిసిందే. కొత్త అండర్‌పాసులు, బ్రిడ్జిల నేపథ్యంలో ఈ మార్గంలో వన్‌వే విధానం అమలు చేస్తున్నారు. అయితే వన్ వే తీరుతెన్నులను హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వన్ వే అమల్లోకి వచ్చి దాదాపు 15 రోజులు పూర్తయిన నేపథ్యంలో ఇప్పటివరకు గమనించిన అంశాలు, ఆ మార్గంలోని వాహనదారుల నుంచి వచ్చిన సూచనలను పరిగణనలోకి తీసుకుంటూ వివిధ విభాగాల ఉన్నతాధికారులతో కలిసి వారు క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఫిల్మ్‌నగర్, జర్నలిస్ట్ కాలనీ, రోడ్ నం.45, జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు, కేబీఆర్ పార్కు మెయిన్‌గేట్ కూడళ్ల వద్ద ట్రాఫిక్ పరిస్థితులను పరిశీలించారు.ఆయా జంక్షన్ల వద్ద వెహికల్స్ ఆటంకం లేకుండా సాఫీగా ముందుకు సాగిపోయేలా చేపట్టాల్సిన దిద్దుబాటు చర్యలపై ప్రత్యేక దృష్టి సారించారు. వెహికల్స్ వేగం మందగిస్తున్న బాటిల్ నెక్ ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో రోడ్లను మరింతగా విస్తరించాలని నిర్ణయించారు. అవసరమైన చోట రోడ్ల మరమ్మతులు చేపట్టాలని, డ్రైనేజీ సమస్యలను కూడా పరిష్కరించాలని అధికారులు నిర్ణయించారు. ముఖ్యంగా ఫిల్మ్‌నగర్ జంక్షన్ నుంచి రోడ్ నం.45 జంక్షన్ మధ్య వెహికల్స్ రాకపోకలను సులభతరం చేసేందుకు ప్రాధాన్య క్రమంలో చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలు చేశారు. ప్రస్తుతం ఈ మార్గంలో రోడ్డు విస్తరణకు అడ్డుగా ఉన్న ఎలక్ట్రిక్ స్తంభాలు, వాటర్ సప్లయ్ పైపులు, డ్రైనేజీ తదితర యుటిలిటీ లైన్లను యుద్ధప్రాతిపదికన ఇతర ప్రాంతాలకు తరలించాలని స్పష్టం చేశారు. హైదరాబాద్ నగర సమగ్ర అభివృద్ధిలో భాగంగా కేబీఆర్ పార్కు చుట్టూ చేపడుతున్న హెచ్–సిటీ ప్రాజెక్టు ఫ్లై ఓవర్లు, అండర్ పాసుల నిర్మాణం కోసం అమలు చేస్తున్న ఈ వన్–వే విధానానికి వాహనదారులు సహకరిస్తున్నారని సజ్జనార్, కర్ణన్ పేర్కొన్నారు.

# మోడీ బహుమతుల వేలంతో 52 కోట్లకు పైగా నిధులు



**న్యూఢిల్లీ,** : భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి వివిధ సందర్భాల్లో అందే కానుకలు, స్మృతిచిహ్నాలు ఇప్పుడు ఆసక్తికరమైన అంశంగా మారాయి. ప్రధాని అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్నప్పుడు, వివిధ సంస్థలు, ప్రముఖులు, రాజకీయ నాయకులు, క్రీడాకారులు, ఇతర ప్రతినిధులు ఆయనకు అనేక రకాల బహుమతులు, మెమెంటోలు అందజేస్తుంటారు. వీటిని కేంద్ర ప్రభుత్వం క్రమం తప్పకుండా ఇ–వేలం నిర్వహించి విక్రయిస్తోంది. ఈ వేలాల ద్వారా ఇప్పటివరకు రూ.52 కోట్లకు పైగా ఆదాయం సమకూరినట్లు కేంద్రం వెల్లడించింది.కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షేఖావత్ లోక్‌సభలో ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో ప్రధాని కానుకల వేలం ద్వారా వచ్చిన ఆదాయానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. నేషనల్ గ్యాలరీ ఆఫ్ మోడర్న్ ఆర్ట్ ఆధ్వర్యంలో ఈ వేలం ప్రక్రియ కొనసాగుతోంది.

2021 తొలి ఎడిషన్: రూ.3.1 కోట్లు
2022 రెండో ఎడిషన్: రూ.3.6 కోట్లు
2023 మూడో ఎడిషన్: రూ.15.8 కోట్లు
2023 నాలుగో ఎడిషన్: రూ.14.4 కోట్లు
2024 ఐదో ఎడిషన్: రూ.11.16 కోట్లు
2024 ఆరో ఎడిషన్: రూ.2.24 కోట్లు
2025 ఏడో ఎడిషన్: రూ.1.89 కోట్లు

ఈ మొత్తం కలిపితే రూ.52 కోట్లకు పైగా నిధులు సమకూరినట్లు కేంద్రం తెలిపింది. సాధారణంగా ప్రధాని మోదీ జన్మదినమైన సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 31 వరకు ఈ–వేలం నిర్వహిస్తున్నట్లు కేంద్ర మంత్రి వివరించారు. 2019కు ముందు ప్రధానికి వచ్చిన ఇలాంటి కానుకలు, స్మృతిచిహ్నాలను ఆధ్వర్యంలో ఈ తరహాలో వేలం వేసే విధానం లేదని కేంద్ర మంత్రి షేకావత్ పేర్కొన్నారు.ప్రధాని మోదీకి అందిన కానుకల్లో దేశంలోని వివిధ ప్రాంతాల సంస్కృతి, కళా సంపదకు ప్రతీకలైన వస్తువులు ఉంటాయి. పెయింటింగ్స్, శిల్పాలు, హస్తకళా వస్తువులు, మతపరమైన విగ్రహాలు, చేనేత వస్త్రాలు, క్రీడా స్మృతిచిహ్నాలు వంటి అనేక రకాల వస్తువులు వేలానికి వస్తాయి. వాటిలో కొన్ని వస్తువులు భారీ ధరలు పలికాయి. గాజు ఫ్రేమ్‌లో మినియేచర్ ఆలయ నిర్మాణంతో ఉన్న తుల్జా భవానీ విగ్రహం సుమారు రూ.1.03 కోట్ల వరకు ధర పలికినట్లు సమాచారం.అయోధ్య రామమందిర మెటాలిక్ మోడల్, జమ్మూకశ్మీర్ పష్మినా షాల్, తంజావూరు రామ దర్బార్ చిత్రం, నటరాజ మెటాలిక్ విగ్రహం, గుజరాత్ రోగన్ ఆర్ట్ 'ట్రీ ఆఫ్ లైఫ్', నాగాలాండ్ చేనేత షాల్, వివిధ వస్త్రాలు, పెయింటింగ్స్ కూడా వేలంలో ఆకర్షణగా నిలిచాయి. క్రీడలకు సంబంధించిన వస్తువులు కూడా వేలంలో ప్రత్యేక ఆసక్తిని కలిగించాయి. 2024 పారాలింపిక్స్ క్రీడాకారుల బూట్లు, ఒలింపిక్, పారాలింపిక్ క్రీడా సామగ్రితో పాటు స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రాకు సంబంధించిన జావెలిన్, రామమందిరం, కాశీ విశ్వనాథ ఆలయ నమూనాలు వంటి వస్తువులు కూడా వేలంలోకి వచ్చాయి.ప్రధాని మోదీకి వచ్చిన కానుకలను వేలం వేసి వచ్చిన ఆదాయాన్ని నమామి గంగే కార్యక్రమానికి కేటాయిస్తున్నట్లు కేంద్రం తెలిపింది. గంగా నది పరిరక్షణ, పునరుద్ధరణ, కాలుష్య నివారణ వంటి కార్యక్రమాలకు ఈ నిధులను ఉపయోగిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ కార్యక్రమమైన నమామి గంగే కింద గంగా, దాని ఉపనదుల్లో కాలుష్యాన్ని తగ్గించడం, నదీ పునరుజ్జీవనం, పర్యావరణ వ్యవస్థను పరిరక్షించడం వంటి చర్యలు చేపడుతున్నారు. మురుగునీటి శుద్ధి మౌలిక సదుపాయాలు, రివర్‌ఫ్రంట్ అభివృద్ధి, జీవవైవిధ్య పరిరక్షణ తదితర ప్రాజెక్టులు ఇందులో భాగంగా ఉన్నాయి. ఈ కార్యక్రమాన్ని నేషనల్ మిషన్ ఫర్ క్లీన్ గంగా) అమలు చేస్తోంది.ప్రధాని మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కూడా తనకు వచ్చిన కానుకలను వేలం వేసి వచ్చిన మొత్తాన్ని బాలికల విద్య కోసం వినియోగించేవారని కేంద్రం వెల్లడించింది. ఇప్పుడు అదే విధానాన్ని జాతీయ స్థాయిలో కొనసాగిస్తూ.. వేలం ద్వారా వచ్చే ఆదాయాన్ని గంగా నది పరిరక్షణకు కేటాయిస్తున్నట్లు తెలిపింది. అంటే.. ప్రముఖులు, సంస్థలు ప్రధానమంత్రికి అందించిన కానుకలు వ్యక్తిగతంగా భద్రపరచడం కాకుండా.. వాటిని ప్రజా ప్రయోజనానికి ఉపయోగపడేలా వేలం వేస్తున్నారు. వేలం ద్వారా వచ్చిన నిధులు దేశంలోని కీలక పర్యావరణ కార్యక్రమానికి మళ్లించడం ఈ ప్రక్రియలో ప్రధాన అంశంగా నిలుస్తోంది.

# నాయిని రాజేందర్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలి

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కాంగ్రెస్ పార్టీని నమ్ముకొని బీఆర్ఎస్ పార్టీ ఇబ్బందులు పెట్టిన కాంగ్రెస్ పార్టీలో నాయిని రాజేందర్ రెడ్డి కొనసాగారు ఇప్పుడున్న ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కంటే సీనియర్ నేత వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని కాంగ్రెస్ శ్రేణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు ఉమ్మడి రాష్టం నుండి ఏ పార్టీ అధికారంలో ఉన్న వరంగల్ జిల్లాకు రెండు మంత్రి పదవులు వస్తాయి.కొండా సురేఖ మంత్రి పదవి బర్తరఫ్ కావడంతో వరంగల్ జిల్లా కు చెందిన ఎమ్మెల్యేలు మంత్రి పదవి కోసం ఎదురు చూపులు చూస్తున్నారు.తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రివర్గ విస్తీర్ణంలో సీనియర్ నేత ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్లు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు,గత దశాబ్దాల కాలం నుండి వరంగల్ జిల్లాకు రెండు మంత్రి పదవులు ఒకానొక సందర్భంలో శాసనసభ స్పీకర్ గా కూడా అవకాశం వచ్చింది. ఏ పార్టీ అధికారంలో ఉన్న వరంగల్ జిల్లాకు రెండు మంత్రి పదవులు .ఇప్పుడున్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ఇద్దరు మహిళా మంత్రులకు అవకాశం కల్పించారు. అనూహ్య కారణాలవల్ల కొండ సురేఖ మంత్రి పదవిని బర్తరఫ్ ? వరంగల్ జిల్లా సంబంధించి ఎమ్మెల్యేలు వారి ప్రయత్నాలు గాడ్ ఫాదర్ ల చుట్టూ తిరుగుతున్నారు. మంత్రి పదవి కావాలంటూ ఆశావాహులైతే వారి యొక్క గాడ్ ఫాదర్ ల చుట్టూ తిరుగుతున్నారు. బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న సందర్భంలో పది సంవత్సరాలు పార్టీ కోసం పనిచేసిన స్థానిక వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే కు మంత్రి పదవి వస్తుందని కాంగ్రెస్ పార్టీ అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

డీకే చాటింపు
తెలంగాణ దిన పత్రిక
ఆదివారం 13 - 9 - 2026

# మరో యుద్ధం తప్పదా..?

పశ్చిమాసియాలో యుద్ధమేఘాలు కమ్ముకుంటున్నాయి. వెనెజెవెలా అధ్యక్షుడిని కిడ్నాప్ చేసిన తర్వాత అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యుద్ధ కాంక్షతో రగిలిపోతున్నాడు. ఇప్పటికే ఆర్థిక సంక్షోభంతో రగిలిపోతున్న ఇరాన్‌పై యుద్ధానికి సిద్ధమవుతున్నాడు. ఇప్పటికే ఇరాన్‌కు పలుమార్లు వార్నింగ్ ఇచ్చాడు. ఇక ఇప్పుడు వార్‌కు రెడీ అవుతున్నాడు. ఆయుధాలు మోహరిస్తున్నాడు. ఇప్పటికే పాకిస్తాన్ బలగాలను ఇరాక్ సరిహద్దుకు తరలించాడు. అమెరికా యుద్ధ విమానాలను రెడీ చేశాడు. తాజాగా అమెరికాకు చెందిన అబ్రహం లింకన్ వాహక నౌక ఇటీవల ఇక్కడికి చేరింది. దీనితో పాటు యూఎస్ఎస్ ఫ్రాంక్ ఈ. పీటర్సన్ జూనియర్, యూఎస్ఎస్ స్ప్రూయాన్స్ డెస్ట్రాయర్లు, యూఎస్ఎస్ మిషెల్ మార్ఫీ కూడా ఇరాన్‌కు తరలించాడు. పశ్చిమసియాలో మొన్నటిదాకా ఇజ్రాయిల్, పాలస్తీనా దేశాల మధ్య దాడులు కొనసాగేవి. ఈ రెండు దేశాల మధ్యలోకి ఇరాక్, సిరియా కూడా వచ్చాయి. దీంతో దాడులు మరింత పెరిగిపోయాయి. ఇప్పుడు అక్కడ పరిస్థితులు నెమ్మదిగా మారిపోతున్న వేళ.. పశ్చిమసియాలో మరోసారి యుద్ధ వాతావరణం ఏర్పడిందిఅమెరికాకు చెందిన యుద్ధ విమాన వాహన నౌక యుఎస్ఎస్ అబ్రహం లింకన్ పశ్చిమాసియా కు చేరుకోవడం కలకలాన్ని కలిగిస్తోంది. దీంతో ఇరాన్ పై అమెరికా దాడులు చేసే అవకాశం ఉందని ప్రచారం మొదలైంది. అబ్రహం లింకన్ యుద్ధ విమాన వాహక నౌక మాత్రమే కాకుండా, యూఎస్ఎస్ ఫ్రాంక్ ఈ పీటర్సన్ జూనియర్, యూఎస్ఎస్ స్ప్రూయాన్స్ డెస్ట్రాయర్లు, యూఎస్ఎస్ మిషెల్ మార్ఫీ వంటి యుద్ధ విమాన వాహక నౌకలు ఇరాన్ సరిహద్దుల్లోకి వెళ్లినట్టు వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే అమెరికాకు చెందిన సెంట్రల్ కమాండ్ ఈ యుద్ధ విమాన వాహక నౌకలు అక్కడికి వచ్చాయని తెలిపింది. ఈ విమానాలు ఇరాన్ సరిహద్దుల్లోని అరేబియా సముద్రంలో ల్యాండ్ అవ్వలేదు. హిందూ సముద్రంలో అవి దిగడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఇది మాత్రమే కాకుండా యుద్ధ విమానాలను, కార్గో విమానాలను ఈ ప్రాంతానికి తీసుకొస్తున్నట్టు తెలుస్తోంది. కొంతకాలంగా ఇరాన్ దేశంలో అక్కడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు ఆందోళనలు చేస్తున్నారు. ఘర్షణలో జరుగుతున్న నేపథ్యంలో వేరాదిమంది ఇప్పటికే చనిపోయారు. అక్కడి ఆందోళనలకు ట్రంప్ బాసటగా నిలిచారు. ఒకవేళ అక్కడి ప్రభుత్వం ఆందోళనకారులకు వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటే మాత్రం తాము రంగంలోకి దిగుతామని ట్రంప్ హెచ్చరించారు. ట్రంప్ చేసిన వ్యాఖ్యల తర్వాత అమెరికా సైన్యం భారీగా ఇరాన్ దిశగా వెళ్లడం రకరకాల సంకేతాలు ఇస్తుంది. ట్రంప్ ఆదేశాలు ఇచ్చిన మరుక్షణంలోనే ఇరాన్ మీద అమెరికా దాడి చేసే అవకాశాలు తెలుస్తోంది. మరోవైపు అమెరికాతో ఇరాన్ చర్చలు జరిపే అవకాశం ఉందని అంతర్జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. చర్చలు ముందుకు సాగితే పరిణామాలు వేగంగా మారిపోతాయని అంతర్జాతీయ విశ్లేషకులు చెబుతున్నారు. యూఎస్ సెంట్రల్ కమాండ్ దీనిని నిర్ధారించింది. ప్రాంత స్థిరత్వం, భద్రతా కారణాల దృష్ట్యా ఈ చర్యలు తీసుకున్నామని తెలిపింది. ఈ నౌబల బృందం ఆరబియా సముద్రం సరిహద్దుల్లో మాత్రమే కాక, హిందూ మహాసముద్రంలో కూడా వెళ్లేందుకు సిద్ధమవుతోంది. ఫలితంగా, ప్రాంతంలో అమెరికా సైనికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. పెంటగాన్ ఇంకా ఎక్కువ ఫైటర్ జెట్‌లు, సైనిక కార్గో విమానాలను ఈ దిశలోకి తరలించే యోచనలో ఉంది. ఇరాన్‌లో పొలిటికల్ అస్థిరతలు, ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలు జరుగుతున్నాయి. ఈ ఘటనల్లో వేల మంది మరణించినట్లు అంచనా. ఆందోళనలకు మద్దతుగా నిలబడిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రభుత్వం ఏమైనా కఠిన చర్యలు తీసుకుంటే జోక్యం చేసుకుంటామని హెచ్చరించారు. దీని ఫలితంగా భారీ సైనిక బలగాలను రెడీ చేస్తున్నామని ప్రకటించారు. ఇది రెండు దేశాల మధ్య ఉద్రిక్తాలను మరింత పెంచింది. ఒకవైపు యుద్ధ విమానాలు, నౌకలను మోహరిస్తున్న అమెరికా.. మరోవైపు ఇరాన్ చర్చలకు ముందుకు వస్తే తాము సిద్ధమని అమెరికా అధికారి తెలిపారు. వెనెజువెలాపై సైలెంట్ ఆపరేషన్ సక్సెస్ అయిన తర్వాత అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యుద్ధ కాంక్షతో రగిలిపోతున్నాడు. ఈ క్రమంలో ఇరాన్‌లో ఆర్థిక సంక్షోభంతో ప్రజలు నిరసనలు తెలుపుతున్నారు. దీనిని ఆసరాగా చేసుకుని ఇరాన్‌పై యుద్ధానికి సిద్ధమవుతున్నాడు.

విలేకరులు కావలెను
రాజకీయ సంచలనాలకు ప్రతీకగా నిలిచిన
డీకే చాటింపు
తెలంగాణ దినపత్రిక
డీకే సారధ్యంలో చాటింపు దినపత్రికలో పనిచేయడానికి తెలంగాణాలోని అన్ని జిల్లా, నియోజకవర్గ, మండల కేంద్రాల్లో పనిచేయడానికి ఆసక్తి, అనుభవం గల విలేకరులు కావలెను.
సంప్రదించండి:
సెల్ : 9603754136 - 7386287837


## లయన్స్ క్లబ్ ఆఫ్ భాగ్యనగర్ జీవనది ఆధ్వర్యంలో విద్యాదానం మహిళా సాధికారత కార్యక్రమం - రూ. 1,55,000 సహాయం






హైదరాబాద్, (డీకే చాటింపు) హైదరాబాద్: లయన్స్ క్లబ్ ఆఫ్ భాగ్యనగర్ జీవనది ఆధ్వర్యంలో ఈరోజు విద్యాదానం మరియు మహిళా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాత లయన్ డా. సాయి కిరణ్ ద్వారకానాథ్ వీణ, గైనకాలజిస్ట్‌లి గారు మొత్తం రూ. 1,55,000 విలువైన సహాయాన్ని అందించారు. ఇందులో ఇద్దరు బాలికలకు ఒక్కొక్కరికి రూ. 25,000 చొప్పున మరియు మరో బాలికకు రూ. 60,000 చొప్పున విద్యా సహాయం కింద మొత్తం రూ. 1,10,000 అందించారు. అలాగే మహిళా సాధికారతలో భాగంగా స్ఫూర్తి ఫౌండేషన్ ఫౌండర్ చైర్మన్ మధుసూదన్ యాదవ్‌లికి మహిళా టైలరింగ్ నైపుణ్య శిక్షణ కోసం రూ. 45,000 విలువైన రెండు నూతన లేటెస్ట్ కుట్టు మిషన్లు అందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా లయన్ డా. బి. విజయ రంగా MJF, హైదరాబాద్ రీజియన్ చైర్ పర్సన్ మరియు లయన్ ఇంటి లక్ష్మీ దుర్గ, క్లబ్ ప్రెసిడెంట్ గారు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ళు గొప్ప కార్యక్రమం :మండలిలో మహేష్ కుమార్




డీకే చాటింపు ప్రతినిధి,(హైదరాబాద్):దేశ చరిత్రలో ఎక్కడ లేని విధంగా ఇందిరమ్మ ఇళ్లు గొప్ప కార్యక్రమం. రాష్ట్రంలో దాదాపు 2 లక్షలకు పైగా ఇళ్లు నిర్మించడం శుభపరిణామమని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. దేశంలో పేదోడి సొంతింటి కలను సాకారం చేసింది కాంగ్రెస్ పార్టీయే నన్నారు.
శుక్రవారం మహేష్ కుమార్ ప్రసంగించారు. గత పదేళ్ల బిఆర్ఎస్ హయంలో అల్లుడు వస్తేఎక్కడ పడుకుంటాడు ఎగతాళి చేసి ఇళ్లు నిర్మించలేని దుస్థితి. నిజామాబాద్ లో పైలెట్ ప్రాజెక్టు కింద ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం. కేంద్రం నుంచి రావాల్సిన 720 కోట్ల రూపాయలు బకాయిలు తక్షణం విడుదల చేయాల్సిన అవసరం ఉందీ. పేదవాడి కలను సాకారం చేయాల్సిందిగాప్రభుత్వానికి విజ్ఞప్తి. ఇళ్ల పేరిటా బిఆర్ఎస్ ఓట్లు దండుకుంది. పాపం పండి కేసిఆర్ ఫామ్ హౌస్ కి పరిమితయ్యారన్నారు.

## విశ్వ సృష్టికర్త విశ్వకర్మ భగవాన్ యజ్ఞ మహోత్సవాలు( జయంతి)కి రూ.10 లక్షలు-వేడుకల నిర్వహణకు ప్రభుత్వం నిధుల మంజూరు

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (డీకే చాటింపు)విశ్వ సృష్టికర్త విశ్వకర్మ భగవాన్ యజ్ఞ మహోత్సవాలు, జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.10 లక్షల నిధులను మంజూరు చేసింది. ఈ నెల 17న విరాట్ విశ్వకర్మ భగవాన్ యజ్ఞ మహోత్సవం నిర్వహించేందుకు వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ద్వారా ఈ మొత్తాన్ని విడుదల చేయనున్నారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం. తెలంగాణ విశ్వబ్రాహ్మణ కో-ఆపరేటివ్ సొసైటీస్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. వేడుకలకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టడంతో పాటు, మంజూరైన నిధులను నిబంధనల ప్రకారం వినియోగించాలని అధికారులు ఆదేశించారు. విశ్వకర్మ జయంతిని అధికారికంగా నిర్వహించేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించడం పట్ల విశ్వబ్రాహ్మణ వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది. విశ్వకర్మ సమాజం సంప్రదాయ వృత్తులు, చేతివృత్తులు, నైపుణ్యాలతో అనుబంధం కలిగి ఉన్న నేపథ్యంలో.. జయంతి వేడుకలను కేవలం ఉత్సవంగా కాకుండా వారి వృత్తి నైపుణ్యాలు, సంక్షేమం, అభివృద్ధిపై చర్చించే వేదికగా నిర్వహించాలనే అభిప్రాయం కూడా విశ్వకర్మలు వ్యక్తం చేస్తున్నారు.




## ఖిల్లా రామాలయంలో హోమం



నిజామాబాద్ ప్రతినిధి సెప్టెంబర్ 12 ( డి.కె చాటింపు) :కిల్లా రామాలయంలో హోమం ప్రతి మాసంలో రెండవ శనివారం ఇందూరు ఆర్య సమాజ్ ఆధ్వర్యంలో హోమము జపము జరుపుకున్నట్లు ఆలయ పూజారి సందీప్ తివారి తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రతి శనివారం అన్న ప్రసాదం వితరణ ఉందని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కిల్ల రామాలయంలొ ఉదయం సాయంత్రం నిత్య పూజలు జరుగుతాయి, భక్తులు సీతారాముల అనుగ్రహం పొందగలరని సూచించారు. ఆలయ చైర్మన్ కమిటీ సభ్యులు తదితరులు విచ్చేసి భోజన ఏర్పాట్లు చేశారు.

## నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 6 వారాలలో 1784 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు

### -కోటి 45లక్షల జరిమానా వసూలు-124 మందికి వారం రోజులు జైలు శిక్ష విధించిన కోర్టులు

నిజామాబాద్ ప్రతినిధి సెప్టెంబర్ 12 (డీకే చాటింపు): నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అన్ని లా అండ్ ఆర్డర్ మరియు ట్రాఫిక్ పి.ఎస్ లలో గడిచిన 6 వారాలలో డ్రంకన్ డ్రైవ్ లో 1784 మంది పట్టు బడగా వారిని నిజామాబాదు , బోధన్ మరియు అర్మూర్ కోర్టులలో హాజరు పర్చగా ఇందులో 124 మందికి వారం రోజుల పాటు జైలు శిక్ష విధించడం జరిగిందని మిగిలిన వారికీ 1,45,20,000/- జరిమానా విధించనైనదని నిజామాబాదు పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, తెలిపారు. కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్ , ఆర్మూర్ , బోధన్ డివిజన్ మరియు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ సమీపాలలో వారి వారి పోలీస్ స్టేషన్ పరిధిలలో వాహనాల తనిఖీలు నిర్వహించడం జరుగుతోంది. ఇందులో భాగముగా 02-08-2026 నుండి 12-09-2026 వరకు వాహన తనిఖీలు నిర్వహించగా మొత్తం 1784 కేసుల నమోదు చేయడం జరిగిందన్నారు.

**వాహనదారులకు సూచనలు**

1) ప్రజలు మద్యం సేవించి వాహనాలు నడపరాదు
2) వాహనాదారులు వాహనానికిసంబంధించినటువంటి పత్రములు సక్రమముగా తమ వద్ద ఉంచుకోగలరు.
3) డ్రంకన్ డ్రైవ్లో పట్టుబడిన వారి లైసెన్స్ 6 నెలల పాటు సస్పెండ్ చేయబడును
4) మద్యం త్రాగి వాహనం నడిపి అనుకోని రోడ్ ప్రమాదం జరిగినట్లయితే ఇన్సూరెన్సు లభించదు.
5) మైనర్లు తాగి వాహనం నడిపి పోలీస్ వారికి దొరికినట్లైతే మైనర్ మరియు వెహికల్ ఓనర్ పైన ఛార్జ్ షీట్ నమోదు చేయబడును అలాగే జైలు శిక్ష విధించే అవకాశం కలదు.
6) ఒక సారి కంటే ఎక్కువ సార్లు పట్టుబడినట్లయితే జైలు శిక్ష విధించబడును
7) మోటర్ వెహికల్ యాక్ట్ 1989 (చట్టం సవరణ - 2019)లి అమలులో ఉన్నందున డ్రంక్ అండ్ డ్రైవ్ లో మొదటిసారి పట్టుబడినట్లయితే 10,000/- జరిమానా లేదా ఆరు నెలల జైలు శిక్ష లేదా జరిమానా తో పాటు జైలు శిక్ష , అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్ లో రెండోసారి పట్టుబడినట్లైతే 15,000/- జరిమానా లేదా జైలు శిక్ష లేదా జైలు శిక్షతో పాటు జరిమానాలు న్యాయస్థానాలు విధించే అవకాశం ఉందని, కాగా పైన చెప్పిన సూచనలు పాటించి సహకరించాలని కమిషనర్ కోరారు.



## గణేష్ నవరాత్రుల డీజే ఆపరేటర్లకు కౌన్సిలింగ్



క్యాతనపల్లి (డీకే చాటింపు):రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని డీజే ఆపరేటర్లకు శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగింది. గణేష్ నవరాత్రి ఉత్సవాల సమయంలో డీజేలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదని పోలీసు అధికారులు స్పష్టం చేశారు. ప్రజలకు, విద్యార్థులకు, వృద్ధులకు మరియు ఇతరులకు ఇబ్బందులు కలిగించే విధంగా అధిక శబ్దంతో డీజేలు నిర్వహించరాదని సూచించారు. ఎస్ఐ జె. శ్రీధర్ మాట్లాడుతూ,.., గణేష్ నవరాత్రుల సందర్భంగా నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా డీజేలు ఏర్పాటు చేస్తే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని డీజే ఆపరేటర్లను హెచ్చరించారు.

సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్
రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్
జె. శ్రీధర్

## మట్టి గణపతి లనే పూజిద్దాం ఆర్మూర్ వాసి 29000 మట్టి గణపతుల పంపిణీ

ఆర్మూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 12 (డీకే చాటింపు):తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మట్టి గణపతి లనే పూజిద్దాం. ఇంటి వద్దనే నిమజ్జనం చేద్దామని ఆర్మూర్ వ్యాపారి సామాజికవేత్త శ్రీమాన్ కొట్టూరు అశోక్ పిలుపినిచ్చారు. పల్లెటూరి చెరువులు ప్రజలకు ఊపిరి ఆ ఊపిరిని మనము పీల్చు కోవాలనీ ,పరిరక్షించాలని, మట్టి గణపతిని పూజిద్దాం. పర్యావరణాన్ని రక్షిద్దాం. ప్రకృతిని కాపాడు కోవడం ప్రతి ఒక్కరి కనీస బాధ్యత. ఈ వినాయక చవితికి మట్టి వినా యకుడినే పూజిద్దాం. పర్యావరణాన్నికాపాడదాం. మట్టి వినాయ కుడిని కొలుద్దాం. భావి తరాలకు పచ్చని ప్రకృతిని అందించడం మనందరి బాధ్యత అన్నారు. ప్రతి గ్రామంలోని చెరువులను కాపాడుకుందాం. ఈ చవితికి మట్టి గణపతిని పూజించి, ప్రకృతిని రక్షించుకుందామన్నారు. పర్యావరణ పరిరక్షణలో మనమూ భాగస్వా ములవుదాం. ఇప్పటివరకు తెలంగాణ వ్యాప్తంగా 29,000 మట్టి వినాయకులు పంపిణీ చేశామని అశోక్ తెలిపారు. 4,000 గణపతులు తయారీలో ఉన్నాయిఅని .గత 41 సంవత్సరంలో నుండి మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్నాం అన్నారు. అంతే కాకుండా ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంలో భాగంగా పేపర్ బ్యాగులు కూడా పంపిణీ చేసినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మట్టి గణపతిలను పూజిద్దాం, పర్యావరణాన్ని రక్షిద్దాం. అనే నినాదంతో ముందుకు సాగుతున్నమాఈ ప్రయ త్నాన్ని ప్రతి ఒక్కరూ పాటించాల నికోరుతూ, పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత. ప్రతి గ్రామంలోని చెరువులను కాపాడు కుందాం,ప్రకృతిని రక్షిద్దామన్నారు.



## పోగొట్టుకున్న మొబైల్ ను అందించిన పోలీసులు

జనగామ/దేవరుప్పుల సెప్టెంబర్ 12 డీకే చాటింపు జిల్లా ప్రతినిధి జనగామ జిల్లా దేవరుప్పుల మండలం రాంబోజి గూడెం గ్రామానికి చెందిన రాంపల్లి యాదగిరి అనే వ్యక్తి తన మొబైల్ ను ఆగస్టు 23 వ తేదీ న పోగొట్టుకొని స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు.
దేవరుప్పుల పోలీస్ సిబ్బంది మొబైల్ ను సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ట్రేస్ చేసి మొబైల్ ను వెతికారు. శనివారం బాధిత యాదగిరిని పోలీస్ స్టేషన్ కి రప్పించి అతనికి మొబైల్ ను అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సైతో పాటు పోలీసులు పాల్గొన్నారు.



# భారీగా పెరుగుతున్న ఇళ్ల అద్దెలు



హైదరాబాద్: హైదరాబాద్‌లో ఇటీవలి కాలంలో ఇళ్ల ధరలు అద్దెలను మించి పెరిగాయని నివేదికలు చెబుతున్నాయి. 2025 మార్చి నాటికి, నగరంలోని స్థిరాస్తి మార్కెట్ గణనీయమైన వృద్ధిని సాధిస్తోంది. హైదరాబాద్.. తెలంగాణ రాజధాని. విశ్వనగరంగా గుర్తింపు పొందింది. పదేళ్లలో గణనీయమైన అభివృద్ధి సాధించడ ంతో ఇక్కడికి కంపెనీలు క్యూ కడుతున్నాయి. దీంతో తెలంగాణ తోపాటు ఆంధ్రప్రదేశ్, ఇతర రాష్ట్రాల నుంచి కూడా ఉద్యోగులు హైదరాబాద్‌లో స్థిరపుతున్నారు. కొందరు అద్దెకు ఉంటుండగా, కొందరు ఇళుల కొనుగోలు చేస్తున్నారు. హైదరాబాద్‌లో ఇటీవలి కాలంలో ఇళ్ల ధరలు అద్దెలను మించి పెరిగాయని నివేదికలు చెబుతున్నాయి. 2025 మార్చి నాటికి, నగరంలోని స్థిరాస్తి మార్కెట్ గణనీయమైన వృద్ధిని సాధిస్తోంది, ముఖ్యంగా ఐటీ కారిడార్‌లు మరియు ఉన్నత స్థాయి రెసిడెన్షియల్ ప్రాంతాలైన గచ్చిబౌలి, మాదాపూర్, కొండాపూర్, హైటెక్ సిటీ వంటి ప్రాంతాల్లో ఈ ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది. సాధారణంగా, హైదరాబాద్‌లో గత కొన్ని సంవత్సరాలుగా ఇళ్ల ధరలు స్థిరంగా పెరుగుతున్నాయి. 2024లో ఒక స్క్వేర్ ఫీట్ ధర సగటున రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు ఉండగా, 2025 నాటికి ఇది కొన్ని ప్రాంతాల్లో రూ.11 వేల నుంచి రూ.12,500 దాటింది. దీనికి ప్రధాన కారణాలు ఐటీ రంగ విస్తరణ, మెరుగైన మౌలిక సదుపాయాలు, నగరంలోకి వలస వచ్చే జనాభా పెరుగుదల. అద్దెల విషయానికొస్తే, హైదరాబాద్‌లో అద్దె ధరలు కూడా పెరిగినప్పటికీ, ఇళ్ల ధరలతో పోలిస్తే అవి నిష్పత్తిలో తక్కువ వేగంతో పెరుగుతున్నాయి. గచ్చిబౌలిలో 2 ఃఊఐ అపార్ట్‌మెంట్ అద్దె సగటున రూ.25 వేల నుంచి రూ.35 వేల వరకు ఉంటే, అదే ప్రాంతంలో ఇంటి కొనుగోలు ధర రూ.80 లక్షల నుంచి రూ.1.2 కోట్ల వరకు ఉంటోంది. దీని ఫలితంగా, రెంటల్(అద్దె ద్వారా వచ్చే ఆదాయం శాతం) సగటున 4?5% వద్ద ఉంటోంది, ఇది ఇళ్ల ధరల పెరుగుదలతో సమానంగా లేదు. ఈ పరిస్థితి కొనుగోలుదారులకు ఒక సవాలుగా మారుతోంది, ఎందుకంటే అద్దెకు ఇల్లు తీసుకోవడం కంటే కొనడం ఖరీదైన ఎంపికగా మారింది

# నష్టాలతో స్టాక్ మార్కెట్లు..!



బిజినెస్ : దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు కొత్త ఆర్థిక సంవత్సరాన్ని భారీ నష్టాలతో ప్రారంభించాయి. అంతర్జాతీయ మార్కెట్లలో బల హీన సంకేతాలు సూచీల సెంటిమెంట్‌ను ప్రభావితం చేస్తున్నా యి. ప్రతీకార టారిఫ్‌లపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏప్రిల్ 2న తుది నిర్ణయాన్ని ప్రకటించనున్న నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. ఈ కారణంగా సూచీలు ఒత్తిడికి గురవుతున్నాయి. మార్కెట్ ప్రారంభంలోనే సెన్సెక్స్ 450 పాయింట్లు నష్టపోగా, నిఫ్టీ 23,400 మార్క్ వద్ద ఊగిసలాడుతోం ది. ఉదయం 9:25 గంటల సమయంలో సెన్సెక్స్ 374 పాయిం ట్ల నష్టంతో 77,035 వద్ద ట్రేడవుతుండగా, నిఫ్టీ 85 పాయింట్ల నష్టంతో 23,433 వద్ద ఉన్నాయి. సెన్సెక్స్ 30 సూచీలో ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాల జీస్, బజాజ్ ఫైనాన్స్, సన్ ఫార్మా, మారుతీ సుజుకీ, టాటా స్టీల్, అల్ట్రాటెక్ సిమెంట్, బజాజ్ ఫిన్‌సర్వ్, హెచ్‌యూఎల్ షేర్లు నష్టాల్లో ట్రేడవుతున్నాయి. ఇండస్ ఇండ్ బ్యాంక్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎంఅండ్ఎం, ఎన్టీపీసీ, అదానీ పోర్ట్స్, నెస్లే ఇండియా షేర్లు లాభాల్లో కొనసాగుతున్నాయి.

మిశ్రమంగా అమెరికా మార్కెట్లు : అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 74.93 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బంగారం ఔన్సు 3,174 డాలర్ల మార్క్‌ను దాటింది. అమెరికా మార్కెట్లు మిశ్రమంగా ముగిశాయి. ఎస్ అండ్ పీ సూచీ 0.55 శాతం, డౌజోన్స్ 1 శాతం మేర లాభపడ్డాయి. నాస్‌డాక్ మాత్రం ఫ్లాట్‌గా ము గిసింది. ఆసియా-పసిఫిక్ మార్కెట్లు నేడు లాభాల్లో ట్రేడవుతు న్నాయి. ఆస్ట్రేలియా ఎఎస్ఎక్స్ సూచీ 0.63 శాతం, జపాన్ నిక్కీ 0.58 శాతం, హాంకాంగ్ హాంగ్‌సెంగ్ 1.05 శాతం, షాంఘై 0.48 శాతం లాభంతో కదలాడుతున్నాయి.

# ఉక్కిరిబిక్కిరవుతున్న సచివాలయ ఉద్యోగులు!

## - సంబంధం లేని శాఖల పనుల అప్పగింతతో తీవ్ర పని భారం



గుంటూరు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన అనేక అంశాలపై క్షేత్ర స్థాయిలో సమాచారం తెలుసుకునేందుకు సచివాలయ ఉద్యోగులతో ఉన్నతాధికారులు పలు రకాల సర్వేలు చేయిస్తున్నారు. ఒక సర్వే పూర్తవ్వగానే మరో సర్వే బాధ్యతలు అప్పగిస్తున్నారు. దీంతో, ఉద్యోగులు క్షేత్ర స్థాయి సర్వేలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. సచివాలయ ఉద్యోగుల సంఖ్య తక్కువగా ఉండడం, ఇతర ప్రాంతాల బాధ్యతలు కూడా వారికే అప్పగించడంతో పనిభారం మరింత పెరిగింది. దీంతో, వివిధ ధ్రువపత్రాలు, ఇతర పనుల కోసం సచివాలయాలకు వచ్చే వారికి వారు అందుబాటులో ఉండలేకపోతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 11 మంది, పట్టణ ప్రాంతాల్లో పది ఉద్యోగులతో గత ప్రభుత్వం సచివాలయాలను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో ఏడుగురు, పట్టణ ప్రాంతాల్లో ఆరుగురు మంది మాత్రమే ఉంటున్నారు. బ్యాంకర్లు తమ ఖాతాదారుల ఆధార్ లింక్, ఇకెవైసి బాధ్యతలను కూడా ఇటీవల సచివాలయాల ఉద్యోగులకు అప్పగించడం వివాదస్పదమైంది. ఈ పనిని బ్యాంకు ఉద్యోగులు చేయాల్సి ఉండగా వివిధ పథకాల కింద నిధులు జమ చేసే పేరుతో అధికారులు ఈ బాధ్యతలను తమకే అప్పగించారని సచివాయాల ఉద్యోగులు వాపోతున్నారు. ఐటి శాఖ చేయాల్సిన వర్క్ ఫ్రం హోం సిటిజన్స్ గుర్తింపు సర్వేనూ తమకే అప్పగించినట్టు చెబుతున్నారు. తాజాగా పి4 సర్వే మొత్తం సచివాలయాలకు అప్పగించారు. పరిశ్రమల శాఖ నిర్వహించాల్సిన ఎంఎస్ఎంఇ సంస్థల గుర్తింపును తమకే అప్పగించారని సచివాలయాల ఉద్యోగులు వాపోతున్నారు. తుపాన్లు, వరదలు, ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు ఇబ్బందులు తలెత్తకుండా హౌస్ హెల్డ్ మ్యాపింగ్, వ్యక్తుల నివాసిత గుర్తింపు వివరాల నమోదుకు ఇంటి ఫొటోలు, జియోట్యాగింగ్ బాధ్యతలు ఇటీవల సచివాలయాల ఉద్యోగులు పూర్తి చేశారు. నేషనల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా చిన్నారులను గుర్తించే, ఆధార్‌లో నమోదు చేయించే బాధ్యతలను కూడా వారికే అప్పగించారు. చర్మకారులకు పలు పథకాల అమలుకు లబ్ధిదారులను గుర్తించడం, పింఛనుదారుల్లో అనర్హుల గుర్తింపునకు వారికి నోటీసులు జారీ చేయడం, వికలాంగులను తిరిగి వైద్య పరీక్షలకు పంపడం తదితర పనులను సచివాలయ ఉద్యోగులతోనే చేయిస్తున్నారు. సహకార సంఘాల్లో రికార్డుల కంప్యూటీకరణలో భాగంగా రైతులకు ఇకెవైసి చేయాల్సిన సంబంధిత శాఖ ఉద్యోగులకు కాకుండా ఈ పని కూడా సచివాలయాల ఉద్యోగులకే అప్పగించారు. సిటిజన్ గుర్తింపు గుర్తింపు సర్వే మున్సిపల్, గ్రామ పంచాయతీలు చేయాల్సి ఉండగా ఈ పని కూడా సచివాలయ ఉద్యోగులతో చేయిస్తున్నారు. రైతులకు సంబంధించిన భూ ఆధార్ నమోదును సచివాలయాల్లోని వ్యవసాయ సహాయకుడికి అప్పగించారు. బియ్యం కార్డుల్లోని సభ్యులు ఇకెవైసి బాధ్యతను విఆర్ఒ చేయాల్సి ఉండగా, ఈ పని కూడా తమకే అప్పగించారని సచివాలయ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో వలంటీర్లు చేసిన ప్రతి పనినీ సచివాలయాల ఉద్యోగులకు అప్పగించారు. వివిధ శాఖల ఉద్యోగులు చేయాల్సిన అన్ని పనులనూ తమకే అప్పగిస్తున్నారని, దీనివల్ల సచివాలయాలకు వచ్చే ప్రజలకు ఉద్యోగులు అందుబాటులో ఉండలేకపోతు న్నారని,.తద్వారా పౌర సేవల్లో కొంత జాప్యం జరుగుతున్న మాట వాస్తవమేనని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామని సచివాలయాల ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.అంకమ్మరావు తెలిపారు. మున్సిపాలిటీల్లో, మండల పరిషత్తుల్లో అనేకమంది ఉద్యోగులు ఉన్నా ప్రతి పనికీ సచివాలయాల ఉద్యోగులకు అప్పగించేస్తున్నారని ఆయన చెప్పారు.

# వైసీపీ యూ టర్న్..!

గుంటూరు, : ఆంధ్రప్రదేశ్ లో వచ్చే ఏడాది స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. అయితే వైసీపీ ఈ ఎన్నికల్లో పోటీ చేయాలని జగన్ దాదాపుగా నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయకపోతే తప్పుడు సంకేతాలు వెళతాయని, నేతలు కూడా గ్రామ, పట్టణ స్థాయిలో డీలా పడే అవకాశముందని జగన్ భావిస్తున్నారు. గెలుపోటములతో సంబంధం లేకుండా పోటీకి దిగితే ఖచ్చితంగా పార్టీ ఎదుగుదలకు అది కారణమవుతుందని వైఎస్ జగన్ భావిస్తున్నారు. అందుకే ఇటీవల జరిగిన నేతల సమావేశంలో బూత్ లెవెల్ కమిటీలు వేయాలని జగన్ ఆదేశించారు. బూత్ లెవెల్ కమిటీల నుంచి పార్టీని బలోపేతం చేసుకుని స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలన్న యోచనలోనే జగన్ ఉన్నారని తెలిసింది. పులివెందుల ఎంపీటీసీ ఉప ఎన్నిక చూసిన తర్వాత కొందరు నేతలు స్థానిక సంస్థల ఎన్నికలకు దూరంగా ఉండాలని జగన్ ఎదుట ప్రతిపాదన పెట్టారు. అయితే జగన్ మాత్రం ఇందుకు అంగీకరించలేదు. ఓటమికి భయపడి ఎన్నికల్లో పోటీ చేయకపోవడం కార్యకర్తల్లోనూ, గ్రామీణ నాయకత్వంలోనూ అసహనం ఏర్పడుతుందని జగన్ అంచనా వేశారు. స్థానిక సంస్థల్లో పోటీ చేయడం వల్ల రెండు ఉపయోగాలుంటాయని జగన్ అంచనా వేస్తున్నారు. ఎన్నికల్లో పోటీ చేయడం వల్ల క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం అవుతుంది. రెండు గ్రామ స్థాయిలో అధికార, విపక్ష వర్గాలుగా విడిపోయి వచ్చే ఎన్నికలకు తమకు అడ్వాంటేజీగా మారుతుందని జగన్ అంచనా వేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తలపడాల్సిందేనని జగన్ నేతలకు ఇప్పటికే సూత్రప్రాయంగా చెప్పారని తెలిసింది. నియోజకవర్గ ఇన్ ఛార్జులు కూడా తమ ప్రాంత పరిధిలోని పార్టీకి నమ్మకమైన నేతలకు, కార్యకర్తలకు పోటీ చేసే అవకాశం కల్పించాలని కూడా జగన్ ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. వచ్చే ఏడాది మొదట్లోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి.

# నిరుద్యోగమే నిరసనలకు కారణమా?

**భారత్ పొరుగు దేశమైన నేపాల్ మాదిరిగానే లడఖ్ యువత ఇటీవల పెద్ద ఎత్తున నిరసన బాటపట్టారు. ఈ నిరసనల్లో పోలీసుల కాల్పుల్లో నలుగురు ప్రాణాల్ని సైతం కోల్పోయారు. కేవలం కొన్ని లక్షల మంది ఉన్న లడఖ్‌లో నిరసనలు జరగడానికి కారణం కేంద్ర ప్రభుత్వ వైఫల్యమా కాదని బిజెపి వాదిస్తోంది. మరేంటి కారణం.. అంటే నిరుద్యోగమే ప్రధాన కారణమని తెలుస్తోంది. లడఖ్ వివరాల్లోకి వెళితే..**



హెచ్చుస్థాయిలోనే అక్షరాస్యత..: లడఖ్‌లో ఉన్నది మూడు లక్షల జనాభానే. అక్కడ హిందువులు, ముస్లింలు, బౌద్ధ మతస్తులు ఉన్నారు. 90 శాతం గిరిజనులే. లడఖ్‌లో జాతీయ విద్యా పథకాలు మాత్రం పేలవంగానే అమలవుతున్నా.. అక్షరాస్యత శాతం ఎక్కువగానే ఉంది. పురుషులు 89 శాతం, మహిళలు 65 శాతం మంది అక్షరాస్యులున్నారు. ఇక్కడ ఉపాధ్యాయుల తరచూ బదిలీలతో పట్టణం వెలుపల ప్రాథమిక సెకండరీ స్థాయి విద్యా బోధనలు అంతంత మాత్రమనే చెప్పుకోవచ్చు. అయినప్పటికీ అక్కడ చిన్నారులు, తల్లిదండ్రులు చదువుకు ప్రాధాన్యమిస్తుండడం గమనార్హం.

వ్యవసాయం..: దాదాపుగా ఇక్కడ వర్షపాతం ఉండదు. పంటలు హిమనదీయ కరిగే నీటి కాలువలు, బుగ్గలు మీదే పంటలు పండుతాయి. సింధు నదీ లోయలలో దాని ఉపనదులపైనే గ్రామస్తులు ఆధారపడతారు. వారు ఎక్కువగా బార్లీ,
గోధుమలు, బఠానీలను పడిస్తారు. పండ్లలో నేరేడు, ఆపిల్స్‌ని పండిస్తారు. మరోవైపు పశువుల పెంపకందారులు పాడి, ఉన్నిలను ఉత్పత్తి చేస్తారు. మేక ఫైబర్‌లను వీరు కాశ్మీర్‌కు వర్తకం చేస్తారు. అయితే లడఖ్‌వాసులు ఆధునిక యంత్రాలతో వ్యవసాయం చేయడానికి మాత్రం విముఖత చూపుతున్నారు.

టూరిజం..: హిమాలయ పర్వతాలు, పాంగోంగ్ సరస్సు హెూయలు, లోయలు.. అక్కడ సంస్కృతి, సంప్రదాయాలు పర్యాటకుల్ని కనువిందు చేస్తాయి. లడఖ్ ప్రధాన ఆర్థిక వనరు పర్యాటకమే. 1974 నుంచే ఇక్కడ పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడం జరుగుతోంది. గత కొన్నేళ్లుగా కేంద్ర ప్రభుత్వాలు ఈ రంగంలోనే వేలాదిమందికి ఉద్యోగ అవకాశాల్ని కల్పించాయి. ఇక్కడికి యూరోపియన్, అమెరికన్లు, భారతీయులు ఎక్కువమంది వస్తారు. ఇక్కడి పర్యావరణం పర్యాటకుల్ని ఆకర్షిస్తున్నా.. మౌలిక సదుపాయాలు సరిగ్గా లేవు. విపరీతంగా నీటికొరత ఉంది. హిమాలయ పర్వతాల నుంచి కరిగే నీటిపైనే ఆధారపడడం.. పైపెచ్చు.. ఎక్కడికక్కడ ఆనకట్టల ద్వారా దిగువకు నీరు లేకపోవడంతో.. అక్కడ ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. పైగా ఉష్ణోగ్రతల్లో మార్పులు కారణంగా వేసవిలో మంచు పర్వతాలు విపరీత స్థాయిలో కరుగుతున్నాయి. దీంతో శీతాకాలంలో నీటి సమస్య లేకపోయినా.. వేసవిలో మాత్రం నీటి కోసం అల్లాడుతున్నారు. సమ్మర్‌లోనే పర్యాటకుల రద్దీ ఎక్కువ. ఆ సమయంలోనే నీటి కొరత వల్ల పర్యాటకుల సంఖ్య కూడా తగ్గుముఖం పడుతుంది. ఇది వారి జీవనాధారంపైనే ప్రభావం చూపుతుంది. నిరుద్యోగం..: 2021-22లో 534 నాన్‌గెజిటెడ్ ఉద్యోగాలకు 50 వేల దరఖాస్తుల్ని పంపారు. అంటే ఒక ఉద్యోగానికి ఆరుగురు పోటీ పడుతున్నారన్నమాట. ఈ విషయాన్ని స్వయంగా సబార్డినేట్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు వెల్లడించింది. 2021-22లో లడఖ్ నిరుద్యోగం 9.8 శాతం. అదే 2022-23కి 26.5 శాతానికి చేరిందని పార్లమెంటు సమావేశాల సందర్భంగా 2023లో రాజ్యసభలో ఎంపీలే వెల్లడించారు. ఇది జాతీయ సగటు నిరుద్యోగ రేటు 2021-22 14.9 శాతం, 2022-23 లో 13.4 శాతానికంటే ఎక్కువ.

సమస్యను పక్కదోవ పట్టించిన మీడియా: జాతీయ మీడియా మాత్రం అసలు సమస్యను పక్కకు నెట్టేసింది. ఇటీవల కాలంలో మీడియా ఏకాడికి లడఖ్ నిరసనల్లో కాంగ్రెస్ కౌన్సిలర్ పుంట్సోగ్ స్టాంజిత్ తెపాగ్ పాల్గొనడాన్నే హైలెట్ చేసింది. పూర్తిగా బిజెపికి వత్తాసునిచ్చింది. నిరసనలకు ముందు ఉద్యమకారుడు వాంగ్‌చుక్ నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక నిరసనల గురించి ప్రసంగించారని.. ఆయన ఆయా దేశాల యువత చేపట్టిన నిరసనల్ని హైలెట్ చేయడం వల్లే బిజెపి కార్యాలయానికి ఆందోళనకారులు నిప్పుపెట్టారని బిజెపి నేతలు ఆయనపై విరుచుకుపడ్డారు. ఇంత పెద్దఎత్తున నిరసనలు జరగడానికి కారణం.. కాంగ్రెస్ పార్టీ, కౌన్సిలర్ పుంట్సోగ్ నిరసనకారుల్ని రెచ్చగొట్టడం వల్లే జరగాయని బిజెపి ఆరోపిస్తోంది.

అక్కడి ప్రజలు డిమాండ్ చేస్తున్నట్లు ప్రత్యేక రాష్ట్ర హెూదా కానీ.. ఆ డిమాండ్ తలెత్తడానికి గల కారణాల్ని కానీ మీడియా పట్టించుకోవడం లేదు. ఇదెంత దారుణం లడఖ్ జమ్మూకాశ్మీర్ కిందకే వస్తుంది. అధికారిక లెక్కల ప్రకారం 1995 నుంచి సొంతంగా కౌన్సిల్ పాలన సాగుతుంది. 2019 ఆగస్టు 5న జమ్మూకాశ్మీర్‌కి ప్రత్యేక హెూదా రద్దు చేయడంతో.. లడఖ్ వాసులు ప్రత్యేక రాష్ట్ర హెూదా కోసం డిమాండ్ చేయడం ప్రారంభించారు. గిరిజనుల కోసం ప్రత్యేక అధికారాలు కలిగిన 6వ షెడ్యూల్ కిందకి లడఖ్‌ని తీసుకురావాలని వారు నినదిస్తున్నారు. 6వ షెడ్యూల్ ద్వారా.. జిల్లా కౌన్సిల్‌లు, శాసన, న్యాయ పరిపాలన స్వయం ప్రతిపత్తిని కలిగి ఉంటాయి. అక్కడి భూమి.. పరిపాలనా, చట్టాలు అన్నీ వారి అధీనంలోకి వస్తాయనే కారణంతోనే లడఖ్ ప్రజలు రాష్ట్ర హెూదా కోసం నిరసనలు చేస్తున్నారు. ఇక్కడి చైనా సరిహద్దు ప్రాంతంగా ఉందని.. కేంద్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తుంది.

# అమరావతికి హైస్పీడ్ కారిడార్..




విజయవాడ, : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రోడ్లు, మౌలిక వసతుల కల్పన, హైస్పీడ్ కారిడార్లపై ఫోకస్ చేసింది. ఎప్పటికప్పుడూ కేంద్ర ప్రభుత్వంతో వందే భారత్ రైళ్లు పెంచడం, బుల్లెట్ రైలు అవకాశాలపై చర్చలు జరుపుతూనే.. రాష్ట్రంలో వీలున్నచోట హైస్పీడ్ కారిడార్ల ఏర్పాటు కోసం కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలో ఏపీకి మరో హైస్పీడ్ కారిడార్ రానుంది. కోల్‌కతా-చెన్నై జాతీయ రహదారి-16 ఏపీ మీదుగా వెళ్తుండగా.. దీనికి సమాంతరంగా ఒక కొత్త హైవే నిర్మించాలని కేంద్ర రవాణా, జాతీయ రహ దారుల మంత్రిత్వశాఖ (మోర్త్) నిర్ణయం తీసుకుంది. పశ్చిమ బెంగాల్‌లోని ఖరగ్‌పూర్ నుంచి ఏపీ మీదుగా తమిళనాడు రాజధాని చెన్నైకి గ్రీన్‌ఫీల్డ్ హైస్పీడ్ కారిడార్ నిర్మించేందుకు కేంద్రం సన్నాహాలు చేస్తోంది. ఈ ప్రాజెక్టు ఎలైన్‌మెంట్‌పై మోర్త్ ఇప్పటికే కసరత్తు మొదలుపెట్టింది. ఇందుకోసం సలహా సంస్థను ఎంపికచేసి, హైవే ఎలా నిర్మించాలనే దానిపై అధ్యయనం చేయించనుంది. ఇప్పటికే కోల్‌కతా-చెన్నై హైవేలో భాగంగా కత్తిపూడి-కాకినాడ నుంచి ఒంగోలు వరకు జాతీయ రహదారి 216 ఉంది. కేంద్రం తాజాగా కోల్‌కత్తా నుంచి చెన్నై మధ్య హైస్పీడ్ కారిడార్ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ కొత్త హైవే విశాఖపట్నం సిటీకి సమీపం నుంచి వెళ్లుంది. విజయవాడ సమీపంలో అమరావతి ఔటర్ రింగ్ రోడ్‌తో హైస్పీడ్ కారిడార్ కలపనున్నారు. తద్వారా గుంటూరు అవతల అదే ఔటర్ రింగ్ రోడ్ నుంచి మిగిలిన భాగం కొనసాగుతుంది. ఆ మార్గాన్ని చెన్నై వరకు నిర్మించకపోయినా, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు మధ్య కోల్‌కతా-చెన్నై హైవేలో కలపాలని మోర్త్ ప్లాన్ చేసింది. దీన్ని పూర్తి స్థాయిలో చెన్నై వరకు కొనసాగిస్తేనే గ్రీన్‌ఫీల్డ్‌తో పాటు, యాక్సెస్ కంట్రోల్ హైవే నిర్మాణం జరుగుతుందని భావిస్తున్నారు. ప్రస్తుత కోల్‌కతా-చెన్నై హైవే మీద వాహనాల రద్దీ అధికంగా ఉంది. రోజురోజుకూ విపరీతంగా రద్దీ పెరుగుతుండటంతో ఈ హైవే అవసరం ఉంది. కానీ పూర్తి మార్గంలో ఆరు వరుసలు నిర్మించ లేదు. కొన్ని ప్రాంతాల్లో 4 లేన్లు మాత్రమే ఉన్నాయి. దాంతో వాహనాలు వేగంగా వెళ్లే అవకాశం లేదు. ఈ కారణంతో కోల్‌కతా-చెన్నై హైవేకి సమాంతరంగా మరొక హైస్పీడ్ కారిడార్ నిర్మాణం పూర్తయితే వాహనదారులకు భారీ ఊరట కలుగుతుంది. ఈ హైవే కొత్త ప్రాంతాల మీదుగా వెళ్లడంతో అవి అభివృద్ధి చెందేందుకు అవకాశాలుంటాయి. అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు 7 హైవేల మీదుగా వెళ్తుంది కనుక అభివృద్ధి జరిగేందుకు వీలుంటుంది. హైస్పీడ్ కారిడార్ అందుబాటులోకి వస్తే ఉత్తర, తూర్పు భారత్.. దక్షిణాది రాష్ట్రాలను అనుసంధానం చేస్తుందని మోర్త్ భావిస్తోంది. విజయవాడ, అమరావతి చుట్టు పక్కల ప్రాంతాలతో పాటు హైస్పీడ్ కారిడార్ వెళ్లే సమీపం ప్రాంతాల్లోనూ అభివృద్ధి జరుగుతుంది. కొత్త కంపెనీలు, పరిశ్రమలు వస్తాయి. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం అమరావతికి మరింత ప్రయోజనం చేకూర్చు తుంది. నెల రోజుల్లో ఈ హైస్పీడ్ కారిడార్‌పై స్పష్టత రానుంది. మోర్త్ ఉన్నతాధికారులు ప్రాజెక్టు ఎలైన్‌మెంట్ల తయారీని పరిశీలిస్తు న్నారు. ఎలైన్‌మెంట్ మీద కసరత్తు పూర్తయితే ఖరగ్‌పూర్- చెన్నై హైస్పీడ్ కారిడార్ వెళ్లే రాష్ట్రాల ప్రభుత్వాలతో సమావేశమై, వారి పర్మిషన్, అభ్యంతరాలు స్వీకరించి తుది ఎలైన్‌మెంట్‌ను ఖరారు చేయనున్నారు. ప్రాజెక్టు వ్యయం, భూసేకరణ కీలకం కానున్నాయి.

# 100 రూపాయలతో రిజిస్ట్రేషన్

కాకినాడ : ఏపీలో కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వారసత్వ భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత సులభతరం చేసింది. అక్టోబర్ నుంచి గ్రామ సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ చేసుకునేలా నిర్ణయం తీసుకుంది. పది లక్షల రూపాయల విలువ కలిగిన భూములకు 100 రూపాయలతో రిజిస్ట్రేషన్ చేసుకునే వేసులుబాటు కల్పించింది. అంతకుమించి అయితే వేయి రూపాయల రుసుము తీసుకోనుంది. గ్రామ సచివాలయాల్లోనే ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగనుంది. దీని ద్వారా ప్రజలకు మరింత సులువైన సేవలు అందించినట్టు అవుతుంది. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న వారికి ఇది నిజంగా ఆనందించదగ్గ విషయమే. ప్రస్తుతం రాష్ట్రంలో భూమి కలిగిన పట్టాదారుల్లో లక్షలాదిమంది జీవించలేరు. కానీ వారి పేర్లతో ఇప్పటికీ పట్టాలు కొనసాగుతున్నాయి. ఇది భూ హక్కుదారులకు ఇబ్బందికరమే. వెబ్ లాండ్ రికార్డుల ప్రకారం రాష్ట్రంలో 85, 41,002 మంది పట్టాదారులు ఉన్నారు. వారిలో 3,91,405 మంది ఇప్పటికే మరణించారు. అంటే మొత్తం పట్టాదారుల్లో 4.58 శాతం మంది జీవించలేరు అన్నమాట. ఈ భూములు వారసుల స్వాధీనంలోనే ఉన్నా వారి పేర్లతో బదిలీ కాకపోవడంతో ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి. దీనిపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. భూ బదలాయింపులకు గాను తక్కువ రుసుముతో గ్రామ సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ జరిగేలా చర్యలు చేపట్టింది. అక్టోబర్ నుంచి ఈ కొత్త విధానం అమలు కానుంది. వారసత్వ భూములను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే ఒక శాతం స్టాంప్ రుసుము చెల్లించాలి. దశాబ్దాలుగా తమ వద్ద ఉన్న భూములను మళ్లీ రుసుము కట్టాలన్న ఆవశ్యకత ఏంటని రైతులు ప్రశ్నిస్తున్నారు. అయితే అంత మొత్తంలో భరించలేని వారు ఉన్నారు.

# మా నిలయం.. ఓ గ్రంథాలయం





చాలామంది రిటైర్ అయ్యాక విశ్రాంతిని కోరుకుంటారు. కానీ, రిటైర్డ్‌లైఫ్‌ను సమాజానికి అంకితం చేశారు ఈ దంపతులు. ప్రభుత్వ ఉద్యోగానికి సిద్ధమవుతున్న గ్రామీణ యువత కోసం తమ నివాసాన్నే గ్రంథాలయంగా మార్చారు. నిరుద్యోగులకు బతుకుబాట చూపుతున్నారు. వారే ఖమ్మం పట్టణానికి చెందిన చావా దుర్గాభవాని, పారుపల్లి అజయ్‌కుమార్ దంపతులు. రూ.20 లక్షలు వెచ్చించి గ్రంథాలయం ఏర్పాటు చేసి, ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా ఉద్యోగార్థులకు చుక్కానిగా నిలుస్తున్న ఈ దంపతులను జిందగీ పలకరించింది. ఆ విశేషాలే ఇవి.. తమ తండ్రులు ఇద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులు కావడంతో వాళ్ల ప్రభావం ఈ ఇద్దరిపై పడింది. ఆ స్ఫూర్తితోనే టీచరు కొలువులు సాధించారు. అందుకే వారి జ్ఞాపకార్థంగా వారి పేర్లను తమ గ్రంథాలయానికి పెట్టుకున్నారు. పెద్ద రీడింగ్ హాల్‌కు అజయ్ కుమార్ తండ్రి పేరుతో 'పారుపల్లిసత్యనారాయణ పుస్తక పూదోట' అని,మినీ రీడింగ్ హాల్‌కు దుర్గా భవాని తండ్రి పేరైన 'చావా రామారావు' అని పేరు పెట్టి విజ్ఞానాన్ని అందిస్తున్నారు. పోటీపరీక్షలతోపాటు సాహితీ ప్రియుల కోసం వివిధ భాషలకు చెందిన గ్రంథాలను ఇక్కడ పొందుపరిచారు.'ఇద్దరం గొప్పగా చదువుకున్నాం. మంచి ఉదోగ్యాల్లో స్థిరపడ్డాం! ఇక సమాజంతో మనకేంటి పని' అని ఏనాడూ అనుకోలేదు ఆ దంప తులు. ఉన్నతమైన ఉపాధ్యాయ వృత్తిని చేపట్టి.. సమాజ నిర్మాణంలో తమవంతు పాత్ర పోషించారు అజయ్, దుర్గాభవాని. పదవీ విరమణ తర్వాత కూడా అదే లక్ష్యంతో ముందుకుసాగుతున్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన చావా దుర్గా భవానికి చదువంటే ఇష్టం. ఆమె తండ్రి ఉపాధ్యాయుడు కావడంతో కూతురును చక్కగా ప్రోత్సహిం చాడు. అలా కష్టపడి 1997లో ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా కొలువు సాధించింది. అదే జిల్లాకు చెందిన పారుపల్లి అజయ్‌కుమార్ కూడా చదువులో మొదట్నుంచీ చురుకే! ఇంటర్ కాగానే టీటీసీ పూర్తిచేశారు. 1986లో ఎస్‌జీటీ టీచర్‌గా తన ప్రస్థానాన్ని మొదలు పెట్టారు. అజయ్, దుర్గ బంధువులు కావడంతో ఇద్దరికీ పెద్దలు పెండ్లి నిశ్చయం చేశారు.

అజయ్ ఉద్యోగం చేస్తూనే ఉన్నత చదువులు చదివి జూనియర్ కాలేజీ అధ్యాపకుడిగా పదోన్నతి పొందారు. అధ్యాపకుడిగా రిటైర్ అయ్యారు. తండ్రి ఉపాధ్యాయ వృత్తి చేస్తున్నా.. దుర్గాభవాని బాల్యంలో ఆటుపోట్లకు కొదువ లేదు. 'బతకలేక బడిపంతులు' అనే ఆ రోజుల్లో.. వాళ్ల కుటుంబానికి ఆర్థిక ఇబ్బందులు తరచూ సవాళ్లు విసిరేవి. కొత్త పుస్తకాలు కొనాలన్నా జేబులు తడుముకోవాల్సిన పరిస్థితులు ఉండేవి. సెకండ్ హ్యాండ్ పుస్తకాలు కొని చదువు వెళ్లదీసింది దుర్గా భవాని. మరోవైపు చిన్నప్పుడు అజయ్ కుమార్ పరిస్థితీ దాదాపు ఇంతే! ఇద్దరూ కష్టాలు చూసి పెరిగిన వాళ్లు కావడంతో, వృత్తిలో స్థిరపడిన తర్వాత కష్టాల్లో ఉన్న ఇతరులను ఆదుకోవడం తమ బాధ్యతగా భావించారు. ఉప్పు, పప్పు దానం చేసి గొప్పకు పోలేదు వాళ్లు. విద్యార్థులకు అండగా నిలిచారు. ఆర్థిక స్థోమత లేని విద్యార్థులకు, ఉద్యోగాన్వేషణలో ఉన్న యువతకు అండగా నిలవాలని భావించారు.

**రూ.20 లక్షలు వెచ్చించి..:** కుటుంబ బాధ్యతలు ఎన్ని ఉన్నా.. ఉన్నంతలో నలుగురికి సాయం చేస్తూ వచ్చారు. రిటైర్ అయ్యాక కూడా పనిచేస్తూనే ఉండాలనే ఆలోచన అజయ్‌ది. తాను రిటైర్ అవ్వగానే భార్యతో 'ఇకనుంచి ఈసామాజానికి మరింత సేవ చేయాలనుంది' అని తన మనసులో మాట చెప్పారు. అందుకు ఆమె కూడా అంగీకరించింది. ఇద్దరూ ఒక్కటిగా ఆలోచించి.. తమలాగా కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించాలనే వారికి చే యుతనివ్వాలని నిర్ణయానికి వచ్చారు. పదిమందికి డబ్బులివ్వడం తోనో, నాలుగు పుస్తకాలు కొనివ్వడంతోనో తమ బాధ్యత పూర్తవు తుందని అనుకోలేదు.తమ ఇంటినే గ్రంథాలయంగా మార్చారు. ఉద్యోగార్థులు, విద్యార్థులు తమ ఇంటికి వచ్చి కావాల్సినవి చదువుకునేలా ఏర్పాటు చేశారు. అలా వికసించిన విద్యావనమే 'పారుపల్లి సత్యనారాయణ పుస్తక పూదోట'. తమ ఇంట్లోని మొదటి అంతస్తు మొత్తాన్ని గ్రంథాలయంగా మార్చేశారు. రూ.20 లక్షలు వెచ్చించి.. మౌలిక వసతులు కల్పించడంతోపాటు పుస్తకాలు సమకూర్చారు.

అలా 2019లో గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ప్రతి రోజూ ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి పది గంటల వరకు ఇది అందరికీ అందుబాటులో ఉంటుంది. లైబ్రరీ నిర్వహణ, కొత్త పుస్తకాలు తీసుకురావడం ఇవన్నీ అజయ్‌కుమార్ పనులు. యువతకు ఉద్యోగ నోటిఫికేషన్ల వివరాలు తెలియపరచడం, సిలబస్ వివరించ డం దుర్గాభవాని కర్తవ్యం. ఇలా ఇద్దరూ కలిసి తమ ఇంటిలో 8000కు పైగా పుస్తకాలను అందుబాటులో ఉంచి.. నిరుద్యోగులకు బాసటగా నిలుస్తున్నారు.

**ఎందరికో కొలువులు:** ఖమ్మం చుట్టుపక్కల గ్రామాల నుంచి పోటీపరీక్షలకు సిద్ధమయ్యే వారికి ఈ గ్రంథాలయం ఓ దేవాలయంతో సమానం. వేలకు వేలు కట్టి కోచింగ్ తీసుకోలేని వారికి ఉచితంగా పుస్తకాలిచ్చి ఉద్యోగం వచ్చేవరకు చదివిస్తున్నారు వీళ్ల. దూరప్రాంతాలకు చెందినవాళ్లు సైతం టౌన్‌లోనే రూమ్ అద్దెకు తీసుకొని నిత్యం ఈ గ్రంథాలయానికి వచ్చి తమ ప్రిపరేషన్ కొనసాగిస్తున్నారు. ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటివరకు ఇక్కడ చదువుకున్నవాళ్లలో 15 మంది పోలీసు ఉద్యోగాలు, 25 మంది టీచర్ కొలువులు సాధించడంతోపాటు పలువురు నేవీ, ఆర్మీ, రైల్వే లాంటి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. గ్రంథాలయ నిర్వహణకు గానూ ప్రతి నెలా రూ.25 వేలకుపైగా సొంత నిధులు ఖర్చుచేస్తున్నారు అజయ్, దుర్గాభవాని దంపతులు.

భవిష్యత్తులో మరిన్ని సేవలు..:

ప్రతిపనిలో కూడా జవాబుదారీగా ఉండాలనే ఆలోచనతో వాళ్ల సన్నిహితులతో కమిటీ ఒకటి వేసుకున్నారు. ఇక్కడ చదువుకొని ఉద్యోగాలు సాధించిన వాళ్లు ఎంతో కొంత డొనేషన్ రూపంలో పంపుతుంటారు. ఆ డబ్బుతో పుస్తకాలు కొంటుంటారు. ప్రస్తుతం దుర్గాభవాని ఖమ్మం పట్టణంలోనే ప్రభుత్వ పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. లైబ్రరీ నిర్వహణలో ఇద్దరూ తలమునకలుగా ఉంటారు. భవిష్యత్తులో గ్రంథాలయాన్ని మరింత అభివృద్ధి పరచాలని భావిస్తున్నారు. ఫ్యాకల్టీని ఏర్పాటు చేసి ఉద్యోగార్థులకు ఉచిత తరగతులు నిర్వహించాలనే తలంపుతో ఉన్నారు. సర్కారు కొలువు సాధించడానికి గ్రామీణ విద్యార్థులకు తోడ్పాటు అందివ్వడమే తమ లక్ష్యం అని చెబుతున్న అజయ్, దుర్గాభవాని దంపతులకు మనమూ హ్యాట్సాఫ్ చెబుదాం!



# తగ్గిన భూముల ధరలు...

## కొనేందుకు 'నో' చెబుతున్న రియల్టర్లు..



నిజామాబాద్,: కామారెడ్డి జిల్లాలో 'భూమ్' దందా ఒక్కసారిగా విలవిలా పడింది. ఏడాది క్రితం అత్యధిక ధరలతో అమ్ముడుపోయిన భూముల అమాంతంగా పడిపోవడంతో రియల్ వ్యాపారులు ఆర్థికంగా చతికిలబడ్డారు. మధ్యవర్తితంగా కొనుగోలు చేసిన భూములు అమ్ముడుపోకపోవడంతో తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారు. ఏడాది క్రితం కోట్ల లోపలికిన భూముల ధర ప్రస్తుతం 40 శాతానికి తగ్గిపోవడంతో అనుకోవాలంటే అసలుకే నష్టం వస్తుందన్న ఆందోళన కలుగుతోంది.వ్యవసాయ భూములే కాకుండా ప్లాట్ల ధరలు కూడా తగ్గుముఖం పట్టడంతో రియల్ వ్యాపారులు తమ దందాను మూసుకునే పరిస్థితి ఏర్పడింది. మరి కొందరు వ్యాపారులైతే వడ్డీలు కట్టలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో జోరుగా సాగిన భూమ్ దందాతో ఆర్థికంగా బాగా స్థిరపడ్డ వ్యాపారులు తాజా పరిస్థితులతో కూడబెట్టుకున్న సొమ్మును వదులు కునే దుస్థితి ఏర్పడింది.టిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు భూముల ధరలు అమాంతంగా ఆకాశానంటాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భూముల ధరలపై తీవ్ర ప్రభావం పడింది. ధరలు తగ్గుముఖం పట్టడంతో భూములు ప్లాట్లు అమ్ముకునేవారు ముందుకు రాకపోవడంతో రియల్ వ్యాపారానికి బ్రేక్ పడింది.కామారెడ్డి జిల్లా కేంద్రంతో పాటు బాన్సువాడ ఎల్లారెడ్డి పిట్లం బీర్కూర్ మదనూర్ జుక్కల్ ప్రాంతాల్లో భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. ఎకరం భూమి కోటి రూపాయలకు పైగా ధర పలుకుతుంది. ప్లాట్ల ధరలైతే గజానికి పదివేల నుండి 25 వేల రూపాయల వరకు ధర పలుకుతుంది. రోడ్ సైడ్ ప్లాట్ లకు ధర ఊహించే విధంగా పెంచేస్తున్నారు. పట్టణాలు మండల కేంద్రాలు ది నదినాభివృద్ధి చెందడంతో స్థలం ధరలు కూడా అడ్డగోలుగా పెరుగుతూ వస్తున్నాయి.ఆర్థికంగా పరిపుష్టి ఉంటే తప్ప వ్యవసాయ భూములు, ప్లాట్లు కొనుగోలు చేసే పరిస్థితి లేదు. మరికొన్ని చోట్ల గతంలో ఉన్న ధరలు ప్రస్తుతం కనిపించడం లేదు. ఒక్కసారిగా భూముల ధరలు పడిపోవడంతో అక్కడి వాసులు జాగల నమ్ముకోవాలంటేనే వెనుకడుగు వేస్తున్నారు. పట్టణాల వైశాల్యం పెరుగుతుం డడం సమీప గ్రామాలను పట్టణంలో చేర్చడంతో జాగా ధర లక్షల నుండి కోట్లలోకి పెరిగి పోయింది. జిల్లాలో ఎల్లారెడ్డి బాన్సువాడ మున్సిపాలిటీగా మారడంతో భూముల ధరలపై ప్రభావం పడింది.ఫలితంగా భూముల అమ్మకాలు కొనుగోలు పూర్తిగా తగ్గుముఖం పట్టాయి. పదిమంది కలిసి రియల్ వ్యాపారంలో పెట్టుబడులు పెట్టేవారు. భూములను ప్లాట్లను కొనుగోలు చేసేటప్పుడు నామమాత్రంగా అడ్వాన్సులు చెల్లించి అట్టి వాటిని అధిక ధరలకు అమ్ముకొని సొమ్ము చేసుకునేవారు. వచ్చిన లాభాన్ని పదిమంది సమానంగా పంచుకునే పరిస్థితి ఉండేది. దీంతో రియల్ వ్యాపారం కొంతకాలం వరకు దండిగా నడిచింది. భూముల ధరలు ఆకాశాన్ని అంటడంతో విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న కొనుగోలు చేసేందుకు ఎవరు ముందుకు రాకపోవడంతో మిన్నకుండు పోవాల్సి వస్తుంది.రియల్ దందాకు అడ్డు కట్టబడడంతో వ్యాపారాన్ని మానుకొని పరిస్థితి నెలకొందని పలువురు రియల్ వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. పలుచోట్ల కొనుగోలు చేసిన భూములు ప్లాట్లు కూడా అమ్ముడుపోకపోవడంతో చేసిన అప్పులకు వడ్డీలు తడిసీమొపై రియల్ వ్యాపారులు ముఖం చాటిసి పరిస్థితి కూడా నెలకొంది. మరికొందరైతే ఈ దందాలో ఇరుక్కుపోయి అరసత్వంగా వచ్చిన భూములు జాగాలను కూడా అమ్ముకొని అప్పులు కట్టే పరిస్థితి కూడా దాపరించింది.రియల్ వ్యాపారం కుదరవడంతో రిజిస్ట్రేషన్లు సైతం తగు ముఖం పట్టాయి. భూముల కొనుగోలు అమ్మకాలు లేకపోవడంతో రియల్ వ్యాపారులతో సందడిగా కనిపించే రిజిస్ట్రేషన్ ఆఫీసులు వేలవేల బోతున్నాయి. రియల్ వ్యాపారం జోరుగా సాగే రోజుల్లో కార్యాలయాలు కిక్కిరిసి కనిపించేవి. రిజిస్ట్రేషన్‌ల కోసం క్రయవిక్రియ దారులు కార్యాలయాల ముందు పడిగాపులు కాచి స్థితి ఉండేది. ప్రస్తుతం భూము లు ధరల ప్రభావం పడడంతో సామాన్యులు కొనుగోలు చేసేందుకు జంకుతుండడంతో రిజిస్ట్రేషన్ శాఖ అధికారులకు బిజీ తగ్గింది.జరుగుతున్న క్రయవిక్రయాలకు కొన్ని మాత్రమే రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని చెబుతున్నారు. ఇంతకుముందు 50 కి పైగా రిజిస్ట్రేషన్లు జరిగేవని, పది రిజిస్ట్రేషన్లు జరగాలంటేనే కష్టంగా ఉన్నట్లు వాపోతున్నారు. డాక్యుమెంటరీ ఫీజు, రిజిస్ట్రేషన్ ఫీజు తో కలిపి భారీగానే సొమ్ము సమకూరేది. అత్యధికంగా రెవిన్యూ అందించే శాఖ కార్యకలాపాలు తగ్గుముఖం పట్టడంతో ప్రభుత్వానికి, భారీగానే గండి పడుతుంది.

# యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

## ఎక్సైజ్ ఎస్సై రాకేష్ కుమార్



కమాన్ పూర్: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మంథని ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ సిఐ ఏ రాకేష్ కుమార్ అన్నారు. కమాన్ పూర్ జిల్లా పరిషత్ పాఠశాల మరియు గుండారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మత్తు పదార్థాలపై అవగాహన విద్యార్థులకు నిర్వహించారు. నేడు 18 సంవత్సరాల నుండి 30 సంవత్సరాల లోపు విద్యార్థులు యువకులు డ్రగ్స్ కు ఆకర్షితులయ్యే అవకాశం ఉందని డ్రగ్స్ కు దూరంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. డ్రగ్స్ వ్యసనం అనేది మన జీవితాన్ని నాశనం చేస్తుందని పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యార్థులు అటువంటి అలవాటులకు పోకుండా శ్రద్ధగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. ముఖ్యంగా మన ఆరోగ్యాన్ని,మానసికంగా ఎన్నో అనర్థాలు వస్తాయని పేర్కొన్నారు. మద్యానికి దూరంగా ఉండాలని గంజాయి వంటి వాటి జోలికి పోకూడదని పేర్కొన్నారు. గంజాయి అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని దీంతో జెల్ జీవితాలు గడపాల్సి వస్తుందని పేర్కొన్నారు. డ్రగ్స్ కేసులో పట్టుబడిన వారికి సుమారు 10 సంవత్సరాల నుండి 20 సంవత్సరాలు జైలు శిక్ష రెండు లక్షల రూపాయలు జరిమానా విధించడం అవుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇన్స్పెక్టర్ సాయికుమార్ డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ ఎస్ ఐ కే పావని మరియు కళాశాల పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# స్వల్పంగా తగ్గిన బంగారం,వెండి ధరలు



న్యూఢిల్లీ: అమెరికా కరెన్సీ డాలర్ బలపడుతున్న నేపథ్యంలో ప్రపంచ వ్యాప్తంగా బంగారం ధరలు స్వల్పంగా దిగొచ్చాయి. భారత్‌లో కూడా బంగారం ధర చెప్పుకోదగ్గ స్థాయిలో తగ్గింది. పెళ్లిళ్ల సీజన్ కొనసాగుతున్నా కూడా రేట్స్‌లో కోత పడింది. దేశంలో ఉదయం సమయంలో 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ. 1,25,120. నిన్నటి ధరతో పోలిస్తే రూ.463 మేర తగ్గింది. ఇక 22 క్యారెట్ 10 గ్రాముల పసిడి ధర కూడా నిన్నటితో పోలిస్తే రూ.650 మేర తగ్గి రూ.1,14,690కు చేరుకుంది. వెండి ధరల్లో కూడా తగ్గుదల కనిపించింది. సోమవారం నాటి ధరతో పోలిస్తే ప్రస్తుతం వెండి రేటు రూ. వెయ్యి మేర తగ్గి రూ.1,62,900కు చేరింది. డాలర్ బలపడటంతో బంగారానికి డిమాండ్ కాస్త తగ్గిందని నిపుణులు చెబుతున్నారు. డాలర్ సూచీ ప్రస్తుతం 100 మార్కుకు పైనే కదలాడుతోంది. గత ఆరు నెలల్లో ఇదే అత్యధికం. దీంతో ఇన్వెస్టర్లకు కమోడిటీ మార్కెట్‌పై ఆసక్తి తగ్గింది. ఈ నేపథ్యంలో వచ్చే నెలలో జరగనున్న అమెరికా ఫెడరల్ రిజర్వ్ సమావేశాలపైనే అందరి దృష్టి నెలకొంది. ఈసారి అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లలో కోత విధించే అవకాశం 70 శాతంగా ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇదే జరిగితే సురక్షిత పెట్టుబడి సాధనమైన పసిడికి మళ్లీ డిమాండ్ పెరిగి ధరలకు రెక్కలొచ్చే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# సిటీ బస్సులకు హైడ్రాలిక్ డోర్స్...

హైదరాబాద్,: బస్సుల్లో ఫుట్‌బోర్డు ప్రయాణాలకు చెక్ పెట్టేందుకు టీజీఎస్‌ఆర్టీసీ కొత్త ఎలక్ట్రిక్ బస్సుల్లో హైడ్రాలిక్ ఆటోమేటిక్ డోర్లు తెచ్చింది. బస్సు ఆగితేనే డోర్లు తెరుచుకుంటాయి, కదులుతుంటే ఆటోమేటిక్‌గా మూసుకుంటాయి. ముఖ్యంగా విద్యార్థుల భద్రత కోసం ఈ వినూత్న మార్పులు చేశారు. ఈ కొత్త బస్సులు ప్రమాదాలను తగ్గించి, ప్రయాణాన్ని సురక్షితంగా మారుస్తాయని అధికారులు ఆశిస్తున్నారు. హైలైట్:ఫుట్‌బోర్డు ప్రయాణాలు, ప్రమాదాలకు చెక్బస్సుల్లో ఫుట్‌బోర్డు ప్రయాణాలు, కదులుతున్న బస్సుల నుంచి దిగడం వంటి ప్రమాదకర విన్యాసాలకు అడ్డుకట్ట వేసేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వినూత్న మార్పులు చేపట్టింది. ప్రయాణికుల, ముఖ్యంగా విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని కొత్తగా ప్రవేశపెడుతున్న ఎలక్ట్రిక్ బస్సుల్లో అత్యాధునిక హైడ్రాలిక్ ఆటోమెటిక్ డోర్ వ్యవస్థను ఏర్పాటు చేస్తోంది. స్టేజీ వద్ద బస్సు పూర్తిగా ఆగినప్పుడు మాత్రమే ఈ డోర్లు తెరుచుకుంటాయి. బస్సు కదులుతున్నప్పుడు లేదా వేగంగా ఉన్నప్పుడు ఇవి ఆటోమెటిక్‌గా మూసుకుని లాక్ అవుతాయి. దీనివల్ల



ప్రయాణికులు పరిగెత్తుకుంటూ వచ్చి బస్సు ఎక్కడం, కదులుతున్న బస్సు నుంచి దిగిపోవడం లేదా ఫుట్‌బోర్డుపై వేలాడటం కుదరదు. ఈ వ్యవస్థ విమానాశ్రయ బస్సులు (ఏసీ ఇంద్ర), హైఎండ్ డీలక్స్ బస్సుల్లో ఉండే సాంకేతికత తరహాలో పనిచేస్తుంది.

యినగరంలో జరిగిన ప్రమాదాలపై ఆర్టీసీ అధికారులు లోతుగా అధ్యయనం చేశారు. ఎక్కువ ప్రమాదాలు ఫుట్‌బోర్డు ప్రయాణాల వల్లే జరుగుతున్నాయని గుర్తించిన అధికారులు, ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉన్న మార్గాలపై దృష్టి సారించారు.

# ఫ్రీగా గూగుల్ ఏఐ కోర్సు..




హైదరాబాద్, : ఎక్కడ చూసినా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీ హవా నడుస్తుంది. ఏఐ స్కిల్స్ ఉన్న వారికే జాబ్ మార్కెట్లో ఆకర్షణీయమైన జీతంతో ఉద్యోగ అవకాశాలు దక్కుతున్నాయి. బ్యాంకింగ్, ఫైనాన్స్, సాఫ్ట్‌వేర్, మీడియా సహా ఏ రంగం చూసినా ఏఐ వాడేస్తున్నారు. ఈ క్రమంలో భారతీయ విద్యార్థుల కోసం గూగుల్ ఏకంగా 3 వేలకుపైగా ఏఐ, టెక్ కోర్సులను ఉచితంగా అందిస్తుంది. ఈ ఏడాది గూగుల్ అందిం చిన అతిపెద్ద ఏఈ అవకాశాలలో ఇది ఒకటి. చాలా మంది ఇప్పటికే ఏఐ కోర్సుల్లో చేరి నైపుణ్యాలను ఒరిసి పట్టుకుంటున్నారు. గూగుల్ ఆఫర్ చేస్తున్న ఈ కోర్సులు ఎందుకూ పనికిరాని సర్టిఫికెట్ కోర్సులుగా భావిస్తే తప్పులో కాలేసినట్లే. ఎందుకంటే ఇది కేవలం యాదృచ్ఛిక అభ్యాస పోర్టల్ కాదు. నిజానికి ఏఈ, క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి పలు సాంకేతికతలను రూపొందించిన గూగుల్ బృందాలచే రూపొందించబడిన కోర్సులు ఇవి. ప్రముఖ దిగ్గజ టెక్ కంపెనీలైన డెలాయిట్, యాక్సెంచర్‌తో సహా 150కి పైగా కంపెనీలు గుర్తించే నిజమైన సర్టిఫికేషన్‌లు ఇవి. ఈ ప్రోగ్రామ్‌లను పూర్తి చేసిన అభ్యర్థులను మాత్రమే ఈ కంపెనీలు నియమించు కుంటున్నాయి. బిగినర్స్ సర్టిఫికేట్‌లు ? నైపుణ్యం బ్యాడ్జ్‌లు ? గూగుల్ క్లౌడ్ సర్టిలు వంటి మూడు స్థాయిల్లో ఈ కోర్సులను గూగుల్ అందిస్తుంది. ముఖ్యంగా ఏఈ, డేటా, క్లౌడ్, ఆటోమేషన్‌లోని కీలక జాబ్ రోల్స్‌కు ఈ నైపుణ్యాలు చాలా అవసరం. స్కిల్ బ్యాడ్జ్‌లను ప్రారంభ స్థాయి నుంచే సంపాదించవచ్చు. పరిశ్రమ గుర్తింపు పొందినగూగుల్ క్లౌడ్ ధృవీకరణలకు అన్ని విధాలుగా మార్పు చేసుకోవచ్చు. దీనితో పాటు ప్రతి నెలా 35 ఉచిత క్లౌడ్ క్రెడిట్‌లను కూడా పొందొచ్చు.కాబట్టి మీరు కేవలం వీడియోల కోసం మాత్రమే కాదు.. దిగ్గజ టెక్ కంపెనీలు ఫోకస్ చేసే నిజమైన ప్రాజెక్ట్‌లను నిర్మిస్తున్నారు. ఇప్పటికే అనేక మంది లింక్డ్‌ఇన్‌లో పెద్దఎత్తున దరఖాస్తు చేసుకుంటూ, తమ ఆత్మవిశ్వాసం పెంపొందించుకుంటున్నారు. కెరీర్‌లో దూసుకుపోవాలనుకునే వారు వీటిని నేర్చుకోవడం మరింత తెలివైన పని అని నిపుణులు సైతం అభిప్రాయపడుతున్నారు. కంపెనీల్లో ఎక్కువగా డిమాండ్ ఉన్న స్కిల్స్ ఏమిటో తెలుసుకుని.. వాటిని పెంపొందిం చుకుంటే భవిష్యత్తు మీదే అని అంటున్నారు. కంపెనీలకు డిగ్రీల అవసరం కంటేనైపుణ్యం ఉన్న వ్యక్తులుఅవసరం. కేవలం ఏఐ నేర్చుకోవడం మాత్రమే కాదు. గూగుల్ నిశ్శబ్దంగా తన భవిష్యత్ వర్క్‌ఫోర్స్‌ను నిర్మిస్తోందన్న సంగతి మర్చిపోకూడదు. వారు ఇప్పుడు ఉచితంగా ఈ కోర్సుల్లో చేరమని ఆహ్వానిస్తున్నారు. ఏఐలో గెలిచిన వారంతా ఫ్యాన్సీ డిగ్రీలు ఉన్నవారు కాదు. వారు వాస్తవాన్ని గ్రహించి స్కిల్స్ పెంపొందించుకుంటున్నారు. ఇప్పుడిప్పుడే ఏఐ యుగం ప్రారంభం అవుతోంది. ఈ క్రమంలో ఏఐ రైలు ఎక్కేందుకు గూగుల్ మీకు ఫస్ట్–క్లాస్ టిక్కెట్‌ను అందజేస్తుంది.

# మహానగర్ విస్తరణకు ఆర్థిక కష్టాలు!

హైదరాబాద్: హైదరాబాద్ మహానగర విస్తరణ జలమండలికి కొత్తగా ఆర్థిక కష్టాలు తెచ్చిపెడుతోంది. ఇప్పటికే ప్రతి నెలా రూ.130కోట్ల లోటుతో నడుస్తున్న జలమండలికి కొత్త ప్రాంతాలను తీసుకురావడంతో ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటి వరకు జలమండలి పరిధి అధికారికంగా 1450.2 చదరపు కిలోమీటర్లు. తాజా విస్తరణతో 2,053.2 చదరపు కిలోమీటర్లు కానుంది. విలీనమైన ప్రాంతాల్లో భారీ సంఖ్యలో కొత్త నల్లా కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంటుంది. సిబ్బందిని అదనంగా నియమించుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో జలమండలికి భారీగా నిధులు అవసరం కానున్నాయి. కొత్తగా విలీనమవుతున్న ప్రాంతాల్లో పటిష్టమైన తాగునీరు, మురుగునీటి వ్యవస్థల ఏర్పాటుకు ప్రభుత్వమే ప్రత్యేకంగా నిధులు అందించాలిహైదరాబాద్ నగరంలో పెరుగుతున్న మౌలిక సదుపాయాల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే హైడ్రాను ఏర్పాటు చేసినట్లు ప్రకటించిన ప్రభుత్వం.. అదే తరహాలో ప్రజాసమస్యలపై ఫోకస్ పెట్టేందుకు, హైదరాబాద్‌ను మరింత గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దేందుకు సిద్ధమైంది. జీహెచ్ఎంసీ 300 వార్డులుగా విస్తరించినట్లు ప్రభుత్వం తెలిపింది. ఇప్పుడు అదే తరహాలో జలమండలిని విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు అధికారులు తెలిపారు. ప్రతి ప్రాంతంలోనూ సమస్యలను సూక్ష్మ స్థాయిలో గుర్తించి పరిష్కరించాలన్నది ప్రభుత్వ ఆలోచన అని అధికారులు అంటున్నారు. జలమండలిని విస్తరణ ద్వారా తాగునీటి సమస్యలు రాకుండా చూడాలన్నదే తమ లక్ష్యమంటున్నారు.నగరంలో 9వేల కిలో మీటర్ల రోడ్లలో 5వేల కిలో మీటర్ల ప్రధాన రోడ్లుండగా, దాదాపు 10వేల కిలో మీటర్ల మేర వర్షం నీటి డ్రైన్లు అవసరం ఉంది. కానీ గ్రేటర్‌లో వెయ్యి కిలో మీటర్లే వర్షం నీటి డ్రైన్‌లు ఉన్నాయి. అయితే రోజురోజుకూ కబ్జాలు పెరగడం.. మరో వైపు రోడ్లను విస్తరిస్తున్న క్రమంలో డ్రెయిన్ వాటర్ లైన్లు కనిపించకుండా పోతున్నాయి. ఇక అభివృద్ధి పేరుతో అపార్ట్‌మెంట్లు, కాంప్లెక్స్‌లు, మల్టీప్లెక్స్‌లు షాపింగ్ మాల్స్ ఇలా తదితర వాణిజ్య వ్యాపార భవంతులు వెలుస్తుండటంతో చినుకు పడితే సిటీ రోడ్లన్నీ చెరువులుగా తలపిస్తున్నాయి. కాలనీలు, బస్తీలు నీట మునుగుతున్నాయి. వీటన్నిటినీ కట్టడి చేసేందుకు ప్రభుత్వం హైడ్రాను రంగంలోకి దించింది. హైడ్రాకు వస్తున్న సత్ఫలితాలతో జలమండలి, జీహెచ్ఎంసీ విస్తరణను వేగవంతం చేసింది.కబ్జాదారుల నుంచి నగరాన్ని కాపాడి రాబోయే తరాల వారికి మంచి వాతావరణం, అభివృద్ధితోపాటు ఆరోగ్యకరమైన జీవితాన్ని అందించేందుకు ప్రభుత్వం హైడ్రాను 2024, జూన్ 18న ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. తక్కువ సమయంలోనే దేశంలో ఏసంస్థకు ఇంతలా ప్రచారం కాలేదని మేధావులు, రాజకీయ నాయకులు, పండితులు, స్వచ్ఛంధ సంస్థలు, ప్రజలు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. హైడ్రా పనితీరుతో ప్రతి ఒక్కరిలో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లపై అవగాహన వచ్చింది.ఇప్పుడు పార్కులు, నాలాలు, చెరువులకు కబ్జా చేయాలన్నా, అక్రమ నిర్మాణాలు చేపట్టాలన్నా వణుకు పుట్టించారు. అయితే హైడ్రా ఏర్పాటు చేయకముందే కాంగ్రెస్ ప్రభుత్వంలో జీహెచ్ఎంసీని మూడు



మహానగర పాలక సంస్థలుగా చేయాలనే ఆలోచన ఉన్నదని విశ్వసనీయ సమాచారం. ఇందులో భాగంగానే మహానగర పాలక సంస్థలుగా విభజించే దిశగా ప్రక్రియ వేగం పుంజుకుంది. అధికారికంగా మూడు కార్పొరేషన్లుగా ప్రకటించకపోయినా, ఆ దిశగా అడుగులు వేస్తోంది. వచ్చే నెల 10వరకు ప్రస్తుత పాలక మండలి పదవీకాలం ఉండటంతో అప్పటిలోపు సిబ్బంది, ఇతరాత్ర విభజన ప్రక్రియను పూర్తి చేయాలనే స్పష్టమైన ఆదేశాలు ప్రభుత్వం అందడంతో దానికి అనుగుణంగా అధికార యంత్రాంగం చర్యలను వేగవంతం చేసింది.జీహెచ్ఎంసీ పరిధిలోకి 20 పురపాలికలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లు కలిపి మొత్తం 27 పట్టణ స్థానిక సంస్థలను (యూఎల్‌బీలు) విలీనం చేయడంతో హైదరాబాద్ పురపాలనలో ప్రభుత్వం నగర పాలనలో కొత్త అధ్యాయానికి నాంది పలికింది. ఈ విలీనంతో జీహెచ్ఎంసీ 300 కార్పొరేషన్లు, 650 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం నుంచి 2,053 చదరపు కిలోమీటర్లకు పెరిగింది. దేశంలోనే అతిపెద్ద మున్సిపల్ కార్పొరేషన్‌గా అవతరించిందని ప్రచారం జోరందుకుంది.ఔటర్ రింగ్ రోడ్ వరకు విస్తరించిన హైడ్రా తరహాలోనే జీహెచ్ఎంసీని విస్తరించారు. ఇందులో భాగంగానే హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరి మూడు కార్పొరేషన్లుగా విభజించేందుకు అంతా సిద్ధమవుతోంది. అందులో భాగంగానే ఉన్నతా ధికారుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బందిని మూడు కార్పొరే షన్‌లకు విభజన ప్రక్రియను వేగవంతం చేశారు. ఇప్పటికే జోన్లకు జోనల్ కమిషనర్లను నియమించిన ప్రభుత్వం, 60 సర్కిళ్లకు డిప్యూటీ కమిషనర్లు బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆయా జోన్‌లకు పరిపాలన, ఆర్థిక, టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగాలకు అధికారులు, సిబ్బంది బదిలీలు చేస్తున్నారు.హైడ్రా, జీహెచ్ఎంసీ తరహాలోనే జలమండలిని విస్తరిస్తున్నారు. జోన్లు, సర్కిళ్లు, సబ్ డివిజన్లు, వార్డులుగా సెక్షన్లగా విస్తరిస్తున్నారు. 12 జోన్లు, 60 సర్కిళ్లుగా విస్తరించే అవకాశముంది. 1450.2చ.కి.మీ. నుంచి 2,053.2చ.కి.మీ వరకు సేవలను అందించనున్నారు. తాగునీటి నల్లా కనెక్షన్లు 14,43,136, 9055.29 కి.మీ మురుగు నీటి పైపులైన్స్, 4,80,269 మాన్‌హోళ్లుండగా ప్రస్తుతం 583 ఏంజీడీల తాగునీరు సరఫరా చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో మరోసారి పరిశీలించిన అనంతరం నివేదిక తయారు చేయనున్నారు. విస్తరణలో భాగంగా ఐదు జోన్ల(సర్కిల్)కు అదనంగా కొత్తగా ఏడు జోన్లను ఏర్పాటు చేశారు. 59 సర్కిల్స్ (సబ్‌డివిజన్) ఉండగా కొత్తగా మరొకటి ఏర్పాటు చేశారు. 192 వార్డులు (సెక్షన్) ఉండగా అదనంగా మరో 108 ఏర్పాటు చేశారు. ఓఆర్ఆర్ లోపలి ప్రాంతాల వరకు ఉన్న పరిధిని ప్రస్తుతం ఓఆర్ఆర్ వెలుపల కూడా విస్తరించారు. జోనల్ అధికారులుగా చీఫ్ జనరల్ మేనేజర్లు(సీజీఎం) బాధ్యతలు చేపట్టనున్నారు. జోన్ పరిధిలో నాలుగు నుంచి ఆరు సర్కిళ్లు ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నారని తెలిసింది. జోనల్ కార్యాలయంలో ఇద్దరు చొప్పున జనరల్ మేనేజర్లు (జీఎంలు) ఉంటారు. ఒక్కో జీఎం రెండు నుంచి మూడు సర్కిళ్లను పర్యవేక్షిస్తారు. సర్కిళ్లలో సర్కిల్ అధికారిగా డిప్యూటీ జనరల్ మేనేజర్లు (డీజీఎంలు) బాధ్యతలు చేపట్టనున్నారు. వారు నాలుగు నుంచి ఐదు వార్డులను పర్యవేక్షించనున్నారు. వార్డు ఆఫీసర్లుగా మేనేజర్లు బాధ్యతలు తీసుకోనున్నారు.లేకపోతే ముందుకు వెళ్లే పరిస్థితి ఉండదని ఉన్నతాధికారులు అభిప్రాయ పడుతున్నారు.

# విజయనగరంలో కొత్త పోలీస్ స్టేషన్లు

విజయనగరం: విజయనగరం జిల్లాలో రెండు పోలీసు స్టేషన్లను ప్రారంభించబోతున్నారు. జిల్లాలో జనాభా పెరుగుదల, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నేపథ్యంలో ఈ 2 కొత్త పోలీస్ స్టేషన్లు త్వరలో ప్రారంభం కానున్నాయి. నెలఖరులోగా కార్యకలాపాలు మొదలయ్యేలా పోలీస్ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. విజయనగరంలో ఏళ్ల నాటి త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రతిపాదనకు ఆమోదం లభించగా, భోగాపురంలో విమానాశ్రయం కోసం ప్రత్యేకంగా మరో స్టేషన్ ఏర్పాటు చేస్తున్నారు. ఇవి శాంతిభద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషించనున్నాయి. విజయనగరం జిల్లాలో త్వరలోనే కొత్తగా రెండు పోలీస్ స్టేషన్లు ప్రారంభం కానున్నాయి. జనవరి నెలఖరులోగా ఈ రెండు పోలీస్ స్టేషన్ల కార్యకలాపాలు మొదలవుతాయని అధికారులు తెలిపారు. ఈ మేరకు పోలీస్ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. విజయనగరంలో పెరుగుతున్న జనాభాకు మెరుగైన సేవలు అందించేందుకు గాను అధికారులు ఈ రెండు పోలీస్ స్టేషన్లను ప్రారంభించబోతున్నారు. వీటిలో ఎన్నో ఏళ్ల నాటి త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు కూడా ఉంది. అలాగే, భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం ఉండటం వల్ల.. ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకుని.. ప్రత్యేకంగా మరో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ రెండు స్టేషన్లు ప్రజలకు మరింత చేరువగా ఉండి, శాంతిభద్రతలను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని అధికారులు తెలిపారు. విజయనగరంలో త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని గత పది సంవత్సరాలుగా ఎన్నోసార్లు ప్రతిపాదించారు. వీటికి తాజాగా ఆమోదం లభించింది. విజయనగరం లో జనాభా విపరీతంగా పెరిగిపోవడంతో, ప్రస్తుతం ఉన్న రెండు పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రజలకు సేవలు అందించడం కష్టమవుతోందని గుర్తించారు. ఈ నేపథ్యంలో, కేఎల్ పురం, కణపాక ప్రాంతాల్లో కొత్త స్టేషన్ ఏర్పాటుకు స్థల సేకరణ జరుగుతోంది. నెలఖరులోగా తాత్కాలిక భవనంలో ఈ స్టేషన్ కార్యకలాపాలు ప్రారంభించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. భోగాపు రంలో అంతర్జాతీయ విమానాశ్రయం త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో, అక్కడ ప్రత్యేక పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న భోగాపురం పోలీస్ స్టేషన్‌తో పాటు, విమానాశ్రయం పరిధిలో ప్రోటోకాల్, ట్రాఫిక్ నియంత్రణ వంటి ప్రత్యేక అవసరాల కోసం ఈ కొత్త పోలీస్ స్టేషన్ మంజూరైంది. భోగాపురం విమానాశ్రయం పనులు చివరి దశకు చేరుకున్నాయి. తాజాగా నిర్వహించిన ట్రయల్ రన్ కూడా విజయవంతమైంది. జూలై నుంచి భోగాపురం విమానాశ్రయం సేవలు ప్రారంభం కానున్నాయి. ఈ క్రమంలో ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకుని.. భోగాపురం విమానాశ్రయంలో విమానాల రాకపోకలు ప్రారంభం కాకముందే, స్టేషన్ ఏర్పాటు, అధికారుల నియామకంపై పోలీస్ శాఖ దృష్టి సారించింది. ఇందులో భాగంగానే ఈ రెండు పోలీస్ స్టేషన్ల ఏర్పాటు జరుగుతోందని అధికారులు అంటున్నారు.

# ధనవంతుల కోసం యూరప్‌తో ఒప్పందం

## లగ్జరీ కార్లపై భారీగా సుంకాలు తగ్గింపు



న్యూఢిల్లీ : ధనవంతుల ఆసక్తుల కోసం యూరోపియన్ యూనియన్ (ఇయు)తో భారత్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి వెంపర్లాడుతోంది. లగ్జరీ కార్ల టారిఫ్‌లపై భారీగా సుంకాలను తగ్గించడానికి మోడీ సర్కార్ అంగీకరించినట్లు రిపోర్టులు వస్తోన్నాయి. దీనికి సంబంధించిన కీలక ప్రతిపాదనలు సిద్ధం అవుతోన్నాయని రిపోర్టులు వస్తోన్నాయి. ఇయు నుంచి దిగుమతి అవుతున్న ఆ కార్లపై ప్రస్తుతం 110 శాతంగా ఉన్న టారిఫ్‌లు 40 శాతానికి తగ్గించేందుకు కేంద్రం అంగీకరించింది. 15వేల యూరోల (దాదాపు రూ.16 లక్షలు) కంటే ఎక్కువ ధర ఉన్నవాటికి ఈ వెసులుబాటు కల్పించనుంది. భవిష్యతులో ఈ సుంకాలు మరింత తగ్గొచ్చని అంచనా. టారిఫ్‌లను భారీగా తగ్గించే వోక్స్‌వ్యాగన్, మెర్సిడజ్ బెస్, బిఎండబ్ల్యు వంటి యూరప్ లగ్జరీ కార్లు భారత మార్కెట్లో మరింత అమ్మకాలను పెంచుకోనున్నాయి.

భారత్, ఇయు మధ్య ఒప్పందం దిశగా ఇంకా చేయాల్సిన పని ఉందని ఇటీవల ఇయు అధ్యక్షురాలు ఉర్సులా వాన్‌డెర్ లేయెన్ పేర్కొన్నారు. తాము చరిత్రాత్మక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునే దశలో ఉన్నామన్నారు. కొందరు దీనిని మదర్ ఆఫ్ ఆల్ డీల్స్‌గా పిలుస్తున్నారన్నారు. దీనివల్ల కోట్లాది మంది ప్రజలకు వస్తువులు, సేవలు ఎగుమతి, దిగుమతి చేసుకొనే సౌలభ్యం కలుగుతుందన్నారు. ప్రస్తుతం ఉర్సులా భారత గణతంత్ర దినోత్సవ వేడుకలకు హాజరయ్యారు. ప్రస్తుత పర్యటనలోనే భారత్, ఇయు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి సంబంధించి కీలక అంగీకారం జరగొచ్చని తెలుస్తోంది.

# గ్రేటర్ లో బలవంతులదే రాజ్యం?

హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిపాలనలో పారదర్శకత ప్రశ్నార్థకంగా మారింది. అధికారుల బదిలీలు ప్రహసనంగా మారాయి. సమర్థత, నిజాయితీ కంటే రాజకీయ అండదండలు, పైరవీలకే పెద్దపీట వేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు, ఏసీబీ విచారణల పరిధిలో ఉన్నవారు సైతం చక్రం తిప్పుతూ, బదిలీ అయిన గంటల వ్యవధిలోనే తిరిగి తమకు నచ్చిన పోస్టింగ్లను దక్కించుకుంటున్న వైనం బల్దియాలో చర్చనీయాంశంగా మారింది.జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తీసుకుంటున్న నిర్ణయాలు, జారీ చేస్తున్న సర్క్యులర్లు గందరగోళానికి గురిచేస్తున్నాయి. మొదట ఒక అధికారిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇవ్వడం.. రాజకీయ ఒత్తిళ్లు రావడం తోనో, లేక తెరవెనుక ఒప్పందాల తోనో కేవలం రెండు గంటల వ్యవధిలోనే ఆ ఉత్తర్వులను వెనక్కి తీసుకుని కొత్త సర్క్యులర్ జారీ చేయడం పరిపాటిగా మారింది. ఈ వ్యవహారం వెనుక భారీ ఎత్తున దందా నడుస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.అమీన్పూర్ డిప్యూటీ కమిషనర్ గా ఉన్న జ్యోతి రెడ్డి వ్యవహారం విస్మయం కలిగిస్తోంది. కమీషనర్ ఆర్వీ కర్ణన్ మొదట జారీ చేసిన ఉత్తర్వుల్లో ఆమెను పటాన్చెరువు డీసీ గా బదిలీ చేశారు. అయితే,ఆఉత్తర్వు వెలువడిన గంటల వ్యవధిలోనే సీన్ మారిపో యింది. రాజకీయ ఒత్తిడితో తిరిగి ఆమెను అమీన్పూర్డీసీగానే కొనసాగిస్తూ కమిషనర్ సవరించిన సర్క్యులర్ జారీ చేశారు.

గంటల వ్యవధిలో ఆమె బదిలీ ఎందుకు ఆగింది.. ఆమె వెనుక ఉన్న శక్తి ఎవరన్నది ఇప్పుడు ప్రశ్నార్థకం.పటాన్చెరు డీసీగా పనిచేస్తున్న సతీష్ విషయంలోనూ ఇదే తంతు నడిచింది. మొదట ఆయన్ను జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు వచ్చాయి. సాధారణంగా హెడ్ ఆఫీస్‌కి పంపడమంటే లూప్ లైన్ కింద లెక్క. కానీ, రెండు గంటల్లోనే చక్రం తిప్పిన సదరు అధికారి.. ఏకంగా యూసఫ్ గూడా డీసీగా కీలకమైన పోస్టింగ్ దక్కించుకోవడం విశేషంఆదిభట్ల డీసీగా ఉన్న సత్యనారాయణ రెడ్డిని మొదట యూసఫ్ గూడాకు బదిలీ చేశారు.అయితే, ఆయనకు ఆ స్థానం నచ్చలేదో లేక ఆదిభట్లలోనే ఉండాలని రాజకీయ నేతలు కోరుకున్నారో తెలియదు కానీ, రెండు గంటల్లోనే ఆయన బదిలీ ఉత్తర్వులు రద్దయ్యాయి. తిరిగి ఆదిభట్ల డీసీగానే పోస్టిం గ్ ఇస్తూ కమిషనర్ కార్యాలయం నుంచి మరో ఆర్డర్ వచ్చింది.బడంగ్పేట కార్పొరేషన్ వ్యవహారం అయితే అవినీతికి నిలువుటద్దంగా మారింది. బడంగ్పేట కమీషనర్గా ఉన్న సరస్వతిపై గతంలో అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆమెను ఇటీవలే కమిషనర్ ఆర్వీ కర్ణన్ హెడ్ ఆఫీస్కు సరెండర్ చేశారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాల్సిన ఉన్నతాధికారులు.. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గారు. ఆమె తనకున్న పొలిటికల్ ఇన్ఫ్లుయెన్స్తో ఏకంగా బడంగ్పేట సర్కిల్కు డిప్యూటీ కమిషనర్ పోస్టను సష్టించుకుని,తెప్పించుకుని మరీ తిరిగి అదే స్థానంలో తిష్టవేయడం గమనార్హం. అవినీతి ఆరోపణలున్న వ్యక్తికి ప్రమోషన్ లాంటి పోస్టింగ్ ఇవ్వడంపై నిజాయితీ గల ఉద్యోగులు విస్తుపోతున్నారు.

# ఇక తగ్గనున్న రిజిస్ట్రేషన్ కష్టాలు!

హైదరాబాద్, : తెలంగాణ ప్రభుత్వం వాహన రిజిస్ట్రేషన్ విధానంలో కొత్త పద్ధతి అమలులోకి తెచ్చింది. ఇటు వాహనదారులకు, అటు రవాణా అధికారులకు ఇద్దరికీ మేలు జరిగేలా నూతన విధానం నుంచిఅమలులోకి వచ్చింది. వాహనం కొన్న చోటే రిజిస్ట్రేషన్ చేసే విధానం ప్రవేశపెట్టింది. మాదాపూర్ రవాణా కార్యాలయంలో నిర్వహించిన ట్రయల్ రన్ విజయవంతమైంది. దీంతో రాష్ట్రమంతా అమలులోకి తెచ్చింది. కొత్త వాహనాలు కొనుగోలు చేస్తే ఇకపై ఆర్టీవో కార్యాలయాల్లో క్యూలు, చక్కరలు అవసరం లేదు. డీలర్లు ఫొటోలు, డాక్యుమెంట్లు ఆన్‌లైన్‌లో సమర్పించి నంబర్ కేటాయిస్తారు. డీలర్లు ఇన్‌వాయిస్, బీమా, చిరునామా ధ్రువీకరణ, వాహన చిత్రాలు అప్‌లోడ్ చేస్తారు. అధికారులు డిజిటల్ పరిశీలన తర్వాత ఆమోదం ఇస్తారు. ఆర్సీ కార్డు చిరునామాకు పోస్ట్ అవుతుంది. అవసరమైతే షోరూమ్‌లో తనిఖీ జరుగుతుంది. అయితే కొత్త విధానం ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలకు మాత్రమే.వాణిజ్య వాహనాలు ఆర్టీవో లోనే చేసుకోవాలి.ఆర్టీవోలో స్లాట్ బుకింగ్, వేచి ఉండటం ముగిసిపోతుంది. కొనుగోలు రోజు సాయంత్రానికి రిజిస్ట్రేషన్ పూర్తి. పట్టణ ప్రజలకు మార్గదర్శకం. డిజిటల్ పారదర్శకత పెరుగుతుంది, అక్రమాలు, బ్రోకర్ వ్యవస్థ తగ్గుతుంది. ఈ వ్యవస్థ వాహన డీలర్లను బలోపేతం చేస్తుంది. వినియోగదారుల అనుభవం మెరుగవుతుంది. రాష్ట్ర వ్యాప్త అమలుతో ట్రాఫిక్, కార్యాచరణ సమస్యలు తగ్గుతాయి. తెలంగాణ సంయుక్త రవాణా కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్ వాహనాల రిజిస్ట్రేషన్లకు సంబంధించిన నూతన విధానాన్ని ప్రారంభించారు. ఈ విధానం వల్ల వినియోగదారులకు సమయం ఆదా అవుతుంది. రిజిస్ట్రేషన్ కోసం రవాణా కార్యాలయం చుట్టూ తిరగాల్సిన అవసరంలేదు. వాహనం అమ్మిన డీలర్ శాశ్వత రిజిస్ట్రేషన్ కోసం ఆన్లైన్‌లో దరఖాస్తు చేస్తారు. రవాణా శాఖ అధికారులు ఆన్లైన్లో పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటారు. ఉదయం వాహనం కొనుగోలు చేస్తే.. సాయంత్రానికి శాశ్వత రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది. ఒకవేళ ఆ వాహనాన్ని సాయంత్రం కొనుగోలు చేస్తే.. రిజిస్ట్రేషన్ మాత్రం మరుసటి రోజు పూర్తవుతుంది.ఆన్లైన్లో రిజిస్ట్రేషన్ కోసం ఇన్ వాయిస్, ఫారం 21, ఫారం 22, ఇన్సూరెన్స్, అడ్రస్ ప్రూఫ్, వెహికల్ ఫోటోలను డీలర్ ఆన్లైన్లో అప్లోడ్ చేస్తాడు. రవాణా శాఖ అధికారి ఆ దరఖాస్తు మొత్తాన్ని పరిశీలించి.. రిజిస్ట్రేషన్ నెంబర్ కేటాయిస్తారు. ఈ ప్రక్రియ మొత్తం పూర్తి అయిన తర్వాత రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ స్పీడ్ పోస్ట్ ద్వారా వాహనాన్ని కొనుగోలు చేసిన వ్యక్తికి వెళ్తుంది. శాశ్వత రిజిస్ట్రేషన్లకు సంబంధించి అవసరమైతే వాహనాలను తనిఖీ చేస్తామ ని.. డీలర్ల షోరూంలోకి వెళ్లి వాహనాలను పరిశీలిస్తామని రవాణా శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ విధానం కేవలం బైక్, కార్లకు మాత్రమే వర్తిస్తుంది. కమర్షియల్ వెహికల్స్ రిజిస్ట్రేషన్ యధావిధిగా ఆర్టీవో కార్యాలయాలలోనే జరుగుతూ ఉంటుంది.

# మొక్కజొన్న సాగు భళా..

## మద్దతు ధర దక్కదేమోనని రైతు ఆందోళన..!



కుభీర్: అన్నం పెట్టే రైతన్నకు సున్నం పెట్టినట్లుగా ఉంది రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారం. ఆరుగాలం రెక్కలను ముక్కలు చేసుకుని కష్టించి పండించిన పంటకు మద్దతు ధర లభించక, పెట్టిన పెట్టుబడులు రాక తీవ్రంగా నష్ట పోతున్న రైతన్నలకు భరోసా లేకుండా పోయింది. ఈ ఏడాది ఖరీఫ్‌లో అతివృష్టి కారణంగా ప్రధాన పంటలైన సోయా, పత్తి దెబ్బతిని సగానికి సగం దిగుబడులు తగ్గిపోయాయి. వచ్చిన పంట ఉత్పత్తులను ప్రభుత్వం కోర్రీలు పెట్టి 25 సోయాబీన్ కూడా కొనుగోలు చేయలేదు. దాంతో రైతులు దళారులకు, ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరలకు పంటను అమ్ముకున్నారు. పీకల్లోతూ కష్టాల్లో మునిగిపోయారు.

ఫలితంగా యాసంగిలోనైనా పత్తి, సోయాకు బదులుగా మొక్కజొన్న సాగుచేసి కొంతలో కొంతైనా నష్టాన్ని పూడ్చుకొందామని మండలంలోని రైతులు భావించారు. అనుకున్నట్లుగానే గత ఏడాది యాసంగి కంటే ఈ ఏడు యాసంగిలో మొక్కజొన్నను దాదాపు రెట్టింపు సాగుచేశారు. నిరుడు 9 వేల పైచిలుకు ఎకరాల్లో మొక్కజొన్న సాగవగా.. ఈ ఏడు 13 వేల ఎకరాల్లోసాగు జరిగింది. జనవరి చివరి వారం నుండి మొక్క జొన్న కోతకు రానుంది.

ఈ తరుణంలో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. మొక్కజొన్నకు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించకపోవడంతో గిట్టుబాటు అవుతుందా లేదా అని రైతులు ఆందోళన చెందుతున్నారు. భరోసా కల్పించాల్సిన ప్రభుత్వం పంటలు సాగుచేసిన రైతాంగాన్ని ఆగం పట్టిస్తోంది. సోయా పంటను కొంటామని చెప్పి రంగు మారిందని, తేమ ఉందని, జల్లెడ పేరిట సవాలక్ష ఆంక్షలు విధించి కేవలం 40, 50 శాతం మాత్రమే కొనుగోలు చేసి రైతులను నష్టాల్లోకి నెట్టారు.

మొక్కకొన్న చేతికొచ్చిన తర్వాత అదే పరిస్థితి పునరావృతం అవుతుందే మోనన్న అనుమానాలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయి. మొక్కజొన్నకు కేంద్ర ప్రభుత్వం ఎంఎస్‌పీ రూ. 2400 ప్రకటించిన ప్పటికీ.. పంట చేతికొచ్చేలోపు కొనుగోలు కేంద్రాలను తెరిచి సకాలంలో కొనుగోళ్లు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

# చంద్రబాబుకు తలనొప్పిగా సొంత మనుషులు?

విజయవాడ, : చంద్రబాబు నాయుడుకు ఇప్పుడు సొంత సామాజికవర్గంలోనే శత్రువులు ఎక్కువయ్యారు. ప్రత్యర్థులు చేసే విమర్శలను పెద్దగా పట్టించుకోవాల్సిన పనిలేదు. కానీ సొంత సామాజికవర్గం నేతలే చంద్రబాబు ప్రతి నిర్ణయాన్ని తప్పుపడుతుం డటం ఆయనకు రాజకీయంగా ఇబ్బందులు తెచ్చిపెడుతుందనే చెప్పాలి. ఒకరకంగా చంద్రబాబు నాయుడుకు బయట శత్రువులతో కంటే ఇంట్లో శత్రువులతో యుద్ధం చేయాల్సిన పరిస్థితి ఈసారి కనిపిస్తుంది. ప్రధానంగా ఈసారి మాత్రం కమ్మ సామాజికవర్గం నేతలు మాత్రమే ఆయనను రాజకీయంగా ఇరకాటంలోకి నెడుతున్నారని చెప్పాలి. అందులో ప్రధానంగా వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఏబీ వెంకటేశ్వరరావు, ముప్పవరపు వెంకయ్య నాయుడులు ఇటీవల చేస్తున్న వ్యాఖ్యలు ఇబ్బందికరంగా మారాయి. వడ్డే శోభనాద్రీశ్వరరావు మాజీ టీడీపీ నేత. చంద్రబాబు మంత్రివర్గంలో వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేశారు. ఇప్పుడు రాజకీయంగా విశ్రాంతి తీసుకుంటున్నారు.

అయితేనేం రాజధాని అమరావతి విషయంలో చంద్రబాబు నిర్ణయాన్ని తప్పుపడుతున్నారు. చంద్రబాబు వ్యతిరేక మీడియాతో పాటు సోషల్ మీడియాలో కూడా వడ్డే ఇంటర్వ్యూలతో చెలరేగిపోతున్నారు. చంద్రబాబు రాజధాని పేరిట రైతులను నిలువునా ముంచుతున్నారంటూ వడ్డే శోభనాద్రీశ్వరరావు పదే పదే వ్యాఖ్యానిస్తున్నారు. తొలిదఫా ల్యాండ్ పూలింగ్ కు ఇచ్చిన రైతులు ఇబ్బందులను చూసైనా రెండో విడత భూ సమీకరణకు సహకరించవద్దంటూ రైతులకు వడ్డే శోభనాద్రీశ్వరరావు పిలుపు నిస్తున్నారు. పచ్చని పంటలు పండే భూములను సర్వనాశనం చేస్తున్నారని, కలల్లో చంద్రబాబు విహరిస్తున్నారని ఫైర్ అవుతున్నారు. మరో ఎయిర్ పోర్టు, మరో ఆరులేన్ల రహదారి అవసరమా? అని ప్రశ్నిస్తున్నారు. ఇక ఏబీ వెంకటేశ్వరరావు చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఇంటలిజెన్స్ చీఫ్ గా పనిచేశారు.

# వైసీపీలో అమరావతి రచ్చ!

అమరావతి, : ఏపీ రాజధాని. కోటాది మంది ఆంధ్రుల ఆశల నగరం..అమరావతి చుట్టే ఏపీ రాజకీయం. అప్పటి నుంచి అదే చర్చ. ఇప్పటికీ అదే రచ్చ. రాజధాని అమరావతి విషయంలో వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ చేసిన కామెంట్స్..మరోసారి అమరావతిపై హాట్ డిబేట్‌కు దారితీశాయి. ఏపీ రాజధాని ప్రాంతంగా అమరావతి అనుకూలమైంది కాదన్న జగన్..రాజధానికి మౌలిక సదుపాయాల కొరత ఉందని అన్నారు. లక్షల కోట్ల భారీ ప్రాజెక్ట్ అని కూడా చెప్పుకొచ్చారు.రాజధాని పేరుతో చంద్రబాబు వేలాది ఎకరాల సేకరణ పేరుతో చేస్తున్నది సరైందని కాదని కూడా జగన్ హాట్ కామెంట్స్ చేశారు. సీఎం ఎక్కడుంటే అదే రాజధాని అంటూ జగన్ చేసిన వ్యాఖ్యలపై సీఎం చంద్రబాబు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. జగన్ మరోసారి రాజధాని అంశాన్ని గెలకడంతో అమరావతి విషయంలో మళ్లీ చర్చ నడుస్తోంది. జగన్ వ్యాఖ్యలు కాస్త పొలిటికల్ డైలాగ్‌వార్‌కు దారితీశాయ్. సీఎం చంద్రబాబుతో సహా మంత్రి నారాయణ..వైసీపీ అధినేత వ్యాఖ్యలకు కౌంటర్ ఇవ్వడంతో కాక మొదలైంది. అమరావతి రాజధాని విషయంలో వైసీపీ ఆలోచనలు మారుతున్నాయా? లేక మూడు రాజధానుల లైన్‌కే కట్టుబడి ఉన్నారా అనే చర్చ జరుగుతోంది. ఒక్కోసారి ఒక్కో తీరుగా వైసీపీ నేతలు స్పందిస్తున్న తీరు గందరగోళానికి దారితీస్తోందని మండిపడుతున్నాయి కూటమి పార్టీలు. ఓసారి మూడు రాజధానుల ముచ్చటే లేదంటారు. మరోసారి సీఎం ఎక్కడుంటే అదే రాజధాని అంటారు. అమరావతే రాజధాని కానీ..విజయవాడ, గుంటూరు మధ్య రాజధాని ఏర్పాటు చేస్తే డెవలప్‌మెంట్‌కు స్కోప్ ఉంటుందని మరో వైసీపీ నేత వాయిస్ వినిపిస్తుంటారు. ఇంతకు ఏపీ రాజధాని అమరావతిపై వైసీపీ స్టాండ్ ఏంటో క్లారిటీ ఇవ్వాలని..జగన్ మాటల్లో కూడా ఈ క్లారిటీ మిస్ అయిందని అంటున్నారు. రాజధానిగా అమరావతి ప్రాంతాన్ని వ్యతిరేకిస్తున్నారా? రాజధాని నిర్మాణంలో తలెత్తుతున్న సమస్యలను ప్రస్తావిస్తున్నారా? లేక మూడు రాజధానుల నినాదానికే కట్టుబడి ఉన్నారా? ఇదేది స్పష్టత లేదని అంటోంది టీడీపీ. ఓవైపు రాజధాని రైతుల సమస్యలను ప్రస్తావిస్తారు..మరోవైపు లక్షల కోట్ల భారీ ప్రాజెక్ట్ అంటారు. ఇంతకు జగన్ ఉద్దేశమేంటనేది ఎవరికి అంతు చిక్కడం లేదంటున్నారు టీడీపీ నేతలు. ఏపీకి అంటూ ఓ రాజధాని ఉండాలని ప్రజలు కోరుకుంటుంటే..జగన్ మాత్రం ఏదో ఒక ట్విస్ట్ ఇస్తూ చర్చకు..రచ్చకు ఆందోళనకు గురిచేస్తున్నారని మండిపడుతున్నారు. ప్రజల ఆకాంక్షలకు తగ్గట్లుగా..అమరావతి రైతుల కోరిక ప్రకారం రాజధానికి చట్టబద్ధత కోసం..గెజిట్ తెచ్చేందుకు ఏపీ సర్కార్ ప్రయత్నిస్తోంది. ఇలాంటి టైమ్‌లో మాజీ సీఎం జగన్ మరోసారి కన్‌ఫ్యూజన్ క్రియేట్ చేసేలా..మాట్లాడటం ఏంటని ప్రశ్నిస్తున్నారు టీడీపీనేతలు. మూడు రాజధానుల నినాదంతో ఎన్నికలకు వెళ్లిన వైసీపీ దారుణంగా ఓడిపోయిందని మర్చిపోయారా అంటూ గుర్తు చేస్తున్నారు. విశాఖ ఆర్థిక రాజధాని అంటూ ఉత్తరాంధ్రలో..కనీసం కూటమి అభ్యర్థులకు గట్టి పోటీ ఇవ్వలేకపోయిందని విమర్శిస్తున్నారు. వైసీపీ ఘోర పరాజయానికి రాజధాని అంశం కూడా ప్రధాన కారణమనే విషయాన్ని మర్చిపోవద్దంటున్నారు. గుంటూరు జిల్లా నుంచి విజయవాడ వరకు వైసీపీ అడ్రస్ లేకుండా పోయిందని..అమరావతిని కాదనుకుని..మూడు రాజధానులు అంటూ కొత్త వివాదం ఎత్తుకోవడమే అందుకు కారణమంటూ వైసీపీపై అటాక్‌కు దిగుతున్నారు. ప్రతిపక్ష నాయకుడిగా..ప్రజల అభిప్రాయం..ఆకాంక్షలకు విరుద్ధంగా జగన్ మాట్లాడాల్సిన తీరు ఇది కాదంటూ తప్పుబడుతోంది టీడీపీ. రాజధాని విషయంలో వైసీపీనే కన్‌ఫ్యూజన్‌లో ఉందో..లేక ప్రజలనే కన్‌ఫ్యూజన్‌లో పెట్టి..హిడెన్ ఎజెండాతో ముందుకు వెళ్తుందో తెలియదు కానీ..ఈ గందరగోళానికి చెక్ పెట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయ్.

రైతులకు మద్దతుగా : అమరావతి విషయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆలోచన పై ఒక క్లారిటీ వస్తోంది. ఆ పార్టీకి అమరావతి రాజధాని అనేది శాపంగా మారింది. అమరావతిని కాదని మూడు రాజధానుల అంశాన్ని తెరపైకి తీసుకువచ్చే క్రమంలో.. ఒక్క అమరావతి ప్రజలే కాదు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రాంతాల ప్రజలు వ్యతిరేకించారు. అయినా సరే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఎంత మాత్రం మార్పు కనిపించడం లేదు. గత కొద్ది రోజులుగా అమరావతి విషయంలో మళ్లీ కలుగజేసుకుంటుంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. అందుకే అమరావతి రైతులు ఇప్పుడు భయపడుతున్నారు. రెండో విడత భూ సమీకరణకు రకరకాల షరతులు పెడుతున్నారు. అయితే దీని వెనుక ఉన్న కారణం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. ఎందుకంటే 2019 నుంచి 2024 మధ్య వారికి చుక్కలు చూపించింది వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం. అందుకే ఇప్పుడు అమరావతి రైతులు ఒకటికి రెండుసార్లు ఆలోచన చేస్తున్నారు. ఇంకా కూటమి ప్రభుత్వానికి మూడేళ్ల వ్యవధి ఉంది. ఇప్పుడు తీసుకున్న భూములకు బదులు రిటర్నబుల్ ప్లాట్స్ అభివృద్ధి చేయాలన్నది ఈ షరతు. అలా చేయకపోతే మూడు సంవత్సరాల్లో ఐదు లక్షల రూపాయలు పరిహారం అందించాలని డిమాండ్ చేస్తున్నారు. ఎందుకంటే ఎన్నికలు జరుగుతాయి. పొరపాటున మళ్లీ వైయస్సార్ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తమ పరిస్థితి వారికి తెలుసు. అందుకే కూటమి ప్రభుత్వం ఎదుట ఈ కీలక ప్రతిపాదన పెడుతున్నారు. ఒకటి కూటమి ప్రభుత్వానికి హెచ్చరించినట్లు అవుతుంది. ముందే జాగ్రత్త పడినట్లు అవుతుంది. అమరావతి రైతుల్లో భయానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒక కారణం. మళ్లీ ఇప్పుడు ఆ పార్టీ కొత్త పల్లవి అందుకుంటుంది. అధికారంలో ఉన్నప్పుడు జగన్మోహన్ రెడ్డి అమరావతి రైతులకు ఎంతలా ఇబ్బంది పెట్టాలో అంతలా పెట్టారు. ఇప్పుడు రైతుల భయాన్ని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అడ్వాన్స్ గా తీసుకుంటుంది.

# మాస్టర్ ప్లాను విస్తరణ..?

## ఔటర్ రింగురోడ్డు వరకూ రాజధాని రోడ్లు మధ్య ప్రాంతం మొత్తంలో ప్లానింగు



అమరావతి : అమరావతి రాజధాని విస్తరణలో భాగంగా రెండోదశ పూలింగు ప్రక్రియ ప్రారంభించిన సిఆర్‌డిఏ త్వరలో మాస్టర్‌ప్లానునూ విస్తరించనున్నట్లు తెలిసింది. పూలింగు ప్రక్రియ ముగిసిన అనంతరం ప్లానింగు విస్తరణకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభించనున్నారు. 189 కిలోమీటర్ల పొడవైన అమరావతి ఔటర్ రింగురోడ్డుకు ఇప్పటికే గెజిట్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. దీనికితోడు ఇన్నర్ రింగురోడ్డు నిర్మాణమూ చేపట్టనున్నారు. అయితే ప్రస్తుతం ఉన్న మాస్టర్ ప్లానును విస్తరించాలనే ఆలోచనలో ఉన్నట్లు ఇటీవల మంత్రి నారాయణ వెల్లడించారు. ప్రస్తుతం ఉన్న రోడ్లను రెండోదశ పూలింగు ప్రాంతానికి విస్తరించనున్నామని, వీటిని ఔటర్ రింగుకు అన్నివైపులా కలిపేలా ప్లానింగు ఉందనీ పేర్కొన్నారు. దీని ప్రకారం తూర్పున 16వ నెంబరు జాతీయ రహదారి హద్దుగా దక్షిణం, పడమర ప్రాంతంలో ఔటర్ రింగురోడ్డు, ఉత్తరాన కృష్ణానది ప్రాంతం మధ్యలో పూర్తిగా ప్లానింగు ఏర్పాటు చేస్తామని మంత్రి వెల్లడించారు. దాదాపుగా సిఆర్‌డిఏ రీజియన్ ప్రాంతం మొత్తం సమగ్ర ప్లానింగు పరిధిలోకి వస్తుంది. ప్రస్తుతం సిఆర్‌డిఏ ప్రాంతం సుమారు 8352 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉంది. అంటే సుమారుగా 20.88 లక్షల ఎకరాలకు విస్తరించి ఉంది. దీనిలో కనీసం మూడు లక్షల ఎకరాల పరిధిలోకి రాజధాని ప్లానింగు ఏరియా పెరుగుతుందనేది అంచనాగా వేస్తున్నారు. ప్రస్తుతం 16వ నెంబరు జాతీయ రహదారికి ఈ3, ఈ5 రోడ్లను కలపనున్నారు. ఈ3 రోడ్డును రెండోదశ ల్యాండ్ పూలింగు ఏరియాకూ తీసుకెళతారు. ప్రస్తుతం రెండోదశ పూలింగు ఏరియాలో రోడ్ నెట్‌వర్కు ఏర్పాటు అనంతరం అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పనిలో పనిగా మొత్తం ఔటర్‌రింగురోడ్డుకూ అనుసంధానం చేయనున్నారు.

2017లోనే కార్యాచరణ: రింగురోడ్ల మధ్యలో ప్లానింగు ఏర్పాటు చేయాలనే అంశంపై 2017 మార్చిలో జరిగిన సిఆర్‌డిఏ అథారిటీ సమావేశంలోనే నిర్ణయించారు. ఇన్నర్ రింగురోడ్డు, ఔటర్ రింగురోడ్డుకు మధ్యలో అభివృద్ధికి అవసరమైన ప్లానింగు చేయాలని అప్పట్లో సిఎం అధికారులకు సూచించారు. దీనికి వీలుగా రాజధాని చుట్టుపక్కల ఏడు ప్రాంతాలను పారిశ్రామిక, వాణిజ్య కేంద్రాలుగా గుర్తించారు. రింగురోడ్లను కూడా వాటిని దృష్టిలో పెట్టుకునే ప్లాను చేశారు. గుడివాడ, గుంటూరు, తెనాలి, సత్తెనపల్లి, కంచికచర్ల, కంకిపాడు, ఉయ్యూరు పరిసరాల్లో ప్రత్యేక అభివృద్ధి కేంద్రాలనూ ఏర్పాటు చేయాలనేది అప్పటి ప్రతిపాదన. ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల కేంద్రంగా గుడివాడ, ఆహ్లాద, పర్యాటక ప్రాంతంగా తెనాలి, లాజిస్టిక్ కేంద్రంగా గన్నవరం ప్రాంతాలను అప్పట్లో ప్రతిపాదించారు. ప్రస్తుతం మాస్టర్‌ప్లాను రూపొందించాలనే మంత్రి ప్రకటన నేపథ్యంలో ఈ వ్యవహారం మరలా చర్చనీయాంశం అయింది.

# బ్లింకిట్ 10 నిమిషాల డెలివరీ ఎత్తివే!

## అదే బాటలో స్విగ్గీ, జెప్టో గిగ్‌వర్కర్ల సమ్మెతో దిగివస్తున్న సంస్థలు

న్యూఢిల్లీ : గిగ్‌వర్కర్ల సమ్మెతో ఇకామర్స్, క్విక్ కామర్స్ సంస్థలు ఒక్కో అడుగు దిగివస్తున్నాయి. ఇటీవల కొన్ని ప్రోత్సాహాలకు ముందుకు రాగా .. తాజాగా అత్యంత కీలకమైన 10 నిమిషాల్లో క్విక్ డెలివరీ విధానానికి గుడ్‌బై చెబుతున్నాయి. క్విక్ డెలివరీపై గిగ్‌వర్కర్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడంతోపాటు పలుమార్లు ఆందోళన చేయడంతో జమాటోకు చెందిన బ్లింకిట్ 10 నిమిషాల్లో డెలివరీ నిబంధనను ఎత్తివేసిందని తెలుస్తోంది. 'పది నిమిషాలలో పది వేలకు పైగా ఉత్పత్తుల డెలివరీ' అనే ట్యాగ్‌లైన్‌ను సవరించి 'మీ ఇంటికే 30 వేలకు పైగా ఉత్పత్తుల సరఫరా'గా బ్లింకిట్ మార్చేసింది. అంటే ఆర్డర్ చేసిన ఉత్పత్తుల సరఫరాకు ఇక నిర్దిష్ట కాలపరిమితి ఉండదన్న మాట. క్విక్ కామర్స్ సంస్థలకు, కార్మిక మంత్రిత్వ శాఖకు మధ్య జరిగిన చర్చల ఫలితంగా బ్లింకిట్ ఈ నిర్ణయం తీసుకుంది. ఉత్పత్తుల డెలివరీకి కాలపరిమితి విధించడంతో గిగ్ వర్కర్లపై ఒత్తిడి పెరుగుతోందని మంత్రిత్వ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. డెలివరీ భాగస్వాములకు సురక్షితమైన పని పరిస్థితులు, మెరుగైన భద్రత కల్పించాలని, సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని కోరింది. స్విగ్గీ,




జెప్టో వంటి ఇతర క్విక్ కామర్స్ సంస్థలు కూడా బ్లింకిట్ బాట పట్టే అవకాశం ఉన్నదని పిటిఐ వార్తా సంస్థ తెలిపింది. ఈ రెండు సంస్థలు కూడా ఉత్పత్తుల డెలివరీకి కాలపరిమితిని నిర్ణయించాయి. గత సంవత్సరం డిసెంబర్ 25, 31న గిగ్ వర్కర్లు డిమాండ్ల సాధన కోసం దేశవ్యాప్త సమ్మె జరిపిన విషయం తెలిసిందే. ముఖ్యంగా వారు పది నిమిషాల డెలివరీ విధానాన్ని వ్యతిరేకిస్తున్నారు. రైడర్ల ఆరోగ్యం, రోడ్డు భద్రత, ఆదాయం వంటి అంశాలకు సంబంధించి వ్యక్తమవుతున్న ఆందోళనలను ఈ సమ్మె ముందుకు తెచ్చింది. సమ్మెకు కార్మిక సంఘాలు కూడా మద్దతు తెలిపాయి.

# భారీగా పెరిగిన మిర్చి ధరలు

గుంటూరు,: గుంటూరు మిర్చి యార్డులో ధరలు భారీగా పెరిగాయి. యార్డుకు కొత్త సరుకు రావడం, ఈ ఏడాది సాగు విస్తీర్ణం తగ్గి దిగుబడులు కూడా తగ్గుతాయన్న సమాచారంతో వ్యాపారులు కొత్త సరుకు కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. కర్నూలు, కడప, అనంతపురం నుంచి మిర్చి బస్తాలు వస్తున్నాయి. గత నెలలో క్వింటాళ్‌కు రూ.3 వేలు పెరగా ఈనెల మొదటి వారం నుంచి ధరలు మరింత పెరిగాయి. గత రెండు నెలల క్రితం ఉన్న ధరల కంటే కనీసం క్వింటాళ్‌కు రూ.5 వేల పెరిగాయి.

మంగళవారం యార్డుకు 44,140 బస్తాలు సరుకు రాగా పాత నిల్వలతో కలిపి 50,136 బస్తాలు అమ్ముడుపోయాయి. ఇంకా 7,187 బస్తాలు నిల్వ ఉన్నాయి. నాన్ ఎసి కామన్ వెరైటీల్లో గరిష్ట ధర క్వింటాళ్ రూ.20 వేలు, కనిష్ట ధర రూ.13 వేలు లభిస్తుంది. తేజ, బాడిగ వెరయిటీ కూడా ఇదే ధరలు వస్తున్నాయి. ఆర్మూర్ రకం కనిష్ట ధర రూ.12 వేలు, గరిష్టంగా రూ.14 వేలు ధర వచ్చింది. గతేడాది సరుకు కోల్డ్ పస్టోరేజిల్లో నిల్వ ఉంది. ఈ సరుకు కూడా ధరలు పెరిగాయి.

# వారసుడు ట్యాగ్ ? ఇప్పుడు లీడర్ ముద్ర

విజయవాడ,: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక పునర్నిర్మాణానికి స్పష్టమైన దిశానిర్దేశం ఇస్తూ ముందుకు సాగుతున్న ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్జాతీయ స్థాయిలో మరోసారి గుర్తింపు పొందారు. ప్రముఖ జాతీయ వారపత్రిక 'ది వీక్' మ్యాగజైన్ కవర్ పేజీపై ఆయన నిలవడం ఇప్పుడు రాజకీయ, ఆర్థిక వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలో పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగాల సృష్టిని లక్ష్యంగా చేసుకుని పనిచేస్తున్న లోకేష్‌ను 'చీఫ్ జాబ్ క్రియేటర్' గా ఆ మ్యాగజైన్ అభివర్ణించడం విశేషం. నారా లోకేష్ విద్యా నేపథ్యం, అంతర్జాతీయ అనుభవం ఆయన పనితీరులో స్పష్టంగా కనిపిస్తోందని 'ది వీక్' పేర్కొంది. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ, కార్నెగీ మెలన్ యూనివర్సిటీ వంటి ప్రపంచ ప్రఖ్యాత సంస్థల్లో విద్యాభ్యాసం చేసిన లోకేష్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనలను వేగంగా అమలు చేసే నాయకుడిగా ఎదిగారని మ్యాగజైన్ విశ్లేషించింది. పరిశ్రమలతో నేరుగా మాట్లాడటం, విధానాల్లో మార్పులు తీసుకురావటం, పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం కల్పించడం ద్వారా రాష్ట్రాన్ని ఇన్వెస్టర్లకు ఆకర్షణీయంగా మార్చుతున్నారని తెలిపింది. ఇది తొలిసారి కాదు. గతంలో ప్రముఖ ఆర్థిక పత్రిక 'బిజినెస్ స్టాండర్డ్'కూడా నారా లోకేష్‌ను 'జాబ్ క్రియేటర్ ఇన్ చీఫ్'గా పేర్కొంది. ముఖ్యంగా ఏపీ ప్రభుత్వం ? రిలయన్స్ ఇండస్ట్రీస్ మధ్య కుదిరిన ఒప్పందం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. కేవలం 30 రోజుల్లోనే రూ.65 వేల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి రావడం వెనుక లోకేష్ కీలక పాత్ర ఉందని ఆ పత్రిక పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆయనతో ప్రత్యేక ఇంటర్వ్యూ కూడా నిర్వహించింది. ఉద్యోగాల కల్పన సబ్ కమిటీ చైర్మన్‌గా లోకేష్ బాధ్యతలు చేపట్టిన తర్వాత రాష్ట్రంలో పెట్టుబడులపై ప్రత్యేక దృష్టి పెట్టారని జాతీయ మీడియా చెబుతోంది. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పరిశ్రమల విస్తరణ, కొత్త ప్రాజెక్టుల ఆమోదం, ఐటీ రంగాన్ని బలోపేతం చేయడం వంటి చర్యలు వేగంగా సాగుతున్నాయని విశ్లేషిస్తోంది. ముఖ్యంగా పెట్టుబడిదారులకు క్లియర్ పాలసీలు, వేగవంతమైన అనుమతులు ఇవ్వడం వల్ల ఆంధ్రప్రదేశ్ మళ్లీ అభివృద్ధి పథంలోకి వస్తోందని వ్యాఖ్యానిస్తోంది. మొత్తానికి, నారా లోకేష్ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ ఆర్థికంగా తిరిగి నిలదొక్కుకునే దిశగా ముందుకెళ్తోందని జాతీయ మీడియా స్పష్టంగా చెబుతోంది. పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగాలే కేంద్రబిందువుగా రాష్ట్ర భవిష్యత్తు రూపుదిద్దుకుంటోందన్న అభిప్రాయం మరింత బలపడుతోంది. నారా లోకేష్ ను నాలుగైదేళ్ల కిందట వారసుడిగా మాత్రమే చూసేవాళ్లు. కానీ తనకంటూ ఒక ప్రత్యేకమైన ముద్ర వేసుకున్న సమర్థవంతమైన నాయకుడిగా ఎదుగుతున్నారు. ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కొద్ది కాలంలోనే, వ్యవస్థలో ఆయన తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులు సంచలనం సృష్టిస్తున్నాయి. అటు ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో, ఇటు విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడంలో ఆయన చూపిస్తున్న చొరవతో సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. లోకేష్ పనితీరు కేవలం రాష్ట్ర స్థాయిలోనే కాకుండా, జాతీయ స్థాయిలో కూడా గుర్తింపు పొందుతోంది. ముఖ్యంగా 'యోగాంధ్ర' వంటి వినూత్న కార్యక్రమాల నిర్వహణ ద్వారా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దృష్టిని ఆకర్షించడమే కాకుండా, ఆయన అభిమానాన్ని కూడా చూరగొన్నారు. యువ నాయకత్వంలో లోకేష్ చూపిస్తున్న పరిణతి, అంకితభావంపై ప్రధానికి ఎంతో నమ్మకం ఏర్పడటం విశేషం. ఇది ఆయన రాజకీయ భవిష్యత్తుకు ఒక బలమైన పునాదిగా మారుతోంది. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడంలో లోకేష్ ఒక ఇండస్ట్రియల్ హీరో గా అవతరించారు. అంతర్జాతీయ కంపెనీలను ఏపీ వైపు మళ్లించడంలో ఆయన అనుసరిస్తున్న వ్యూహాలు భారతీయ పారిశ్రామిక రంగాన్ని అబ్బురపరుస్తున్నాయి. తాజాగా ప్రముఖ ది వీక్ మ్యాగజైన్ కవర్ పేజీపై ఆయనను ప్రదర్శించడం, ఆయన పెరుగుతున్న ప్రాభవానికి నిదర్శనం. పెట్టుబడుల విషయంలో ఆయన చూపిస్తున్న వేగం చూస్తుంటే, రాబోయే రోజుల్లో ఏపీ పారిశ్రామిక హబ్‌గా మారడం ఖాయమనిపిస్తోంది. లోకేష్ ప్రభావం కేవలం ఆంధ్రప్రదేశ్‌కే పరిమితం కాలేదు. బీహార్ వంటి ఇతర రాష్ట్రాల ఎన్నికల ప్రచారానికి వెళ్లినప్పుడు అక్కడ ఆయనకు లభించిన ఆదరణ అసాధారణం. అక్కడి యువత లోకేష్‌ను ఒక రోల్ మోడల్‌గా భావించి బ్రహ్మరథం పట్టడం చూస్తుంటే, ఆయన జాతీయ స్థాయిలో ఎదగగల సత్తా ఉన్న నాయకుడని స్పష్టమవుతోంది. క్షేత్రస్థాయి సమస్యలపై అవగాహన, ఆధునిక సాంకేతికతపై పట్టు ఉన్న లోకేష్, నిశ్చయంగా దేశ రాజకీయాల్లో ఒక వెలుగు వెలిగే భవిష్యత్ నాయకుడు అని ఎక్కువ మంది అంచనా వేస్తున్నారు.

# సింగర్ సునీత తనయుడి కొత్త సినిమా..





ప్రముఖ సింగర్ సునీత తనయుడు ఆకాశ్ గోపరాజు హీరోగా వస్తోన్న చిత్రం కొత్త మలుపు. ఈ మూవీలో భైరవి అర్ధ్యాహీరోయిన్‌గా నటిస్తోంది. శివ వరప్రసాద్ కేశనకుర్తి దర్శకత్వంలో ఈ సినిమాను తెరకెక్కించారు. తాటి బాలకృష్ణ నిర్మించిన ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది. తథాస్తు క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మించగా.. మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ విడుదల చేయనున్నారు. ఈ నేపథ్యంలో ట్రైలర్ రిలీజ్ చేశారు. ప్రముఖ దర్శకుడు ఎ. కోదండరామి రెడ్డి చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎ. కోదండరామి రెడ్డి మాట్లాడుతూ.. 'ట్రైలర్‌చాలా బాగుంది. సినిమా కాన్సెప్ట్‌కూడా నచ్చింది. హీరో, హీరో యిన్ ఇద్దరూ ఆకట్టుకున్నారు. ప్రేక్షకులు ఈ చిత్రాన్ని పెద్ద విజయంగా నిలబెట్టాలని కోరుకుంటున్నాను" అన్నారు. ట్రైలర్ చూస్తుంటే గ్రామీణ నేపథ్యంలో సాగే ప్రేమకథగా తెరకెక్కించినట్లు తెలుస్తోంది. ఈ రొమాం టిక్ ప్రేమకథలో ప్రేమ, సస్పెన్స్, వినోదం ఉండేలా కనిపిస్తోంది. ఇందులో ఆకాష్, భైరవి బావ, మరదళ్ల పాత్రల్లో కనిపించనున్నారు. కేవలం ప్రేమకథ మాత్రమే కాకుండా భావోద్వేగాలు, ఉత్కంఠ, హాస్యం, కుటుంబ ప్రేక్షకులను అలరించేలా ట్రైలర్ చూస్తే అర్థమవు తోంది. ఈ చిత్రంలో రఘుబాబు, పృథ్వీరాజ్, ప్రభావతి కీలక పాత్రలు పోషించారు. ఈ మూవీకి రిలీజ్ చేసిన దర్శక దిగ్గజం కోదండరామి రెడ్డికి హృదయ పూర్వక ధన్యవాదములు. రొమాంటిక్ లవ్ సస్పెన్స్ జానర్‌లో ఈ సినిమాను రూపొందించాం.

# 'కాక్‌టెయిల్ 2'లో నటించడానికే భయపడ్డా!

కొద్ది రోజుల్లో 'కాక్‌టెయిల్ 2'తో ప్రేక్షకుల్ని అలరించడానికి ముస్తాబవుతోంది అందాల తార రష్మిక. ఆమె, షాహిద్ కపూర్, కృతి సనన్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రమిది. ఇటీవలే విడుదలైన ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఇందులో దియా పాత్రలో కనిపించనుంది రష్మిక. ఈ నేపథ్యంలోనే ఓ కార్యక్రమంలో పాల్గొన్న రష్మిక.. ఈ సినిమా గురించి మాట్లాడు తూ.. "ఈ ప్రాజెక్టులో నటించడం గురించి నేను అంత సులభంగా నిర్ణయం తీసుకోలేదు. ముఖ్యంగా ఇందులో నటించడానికి నిజంగా భయపడ్డాను. ఎందుకంటే ఇప్పటి వరకు నేను భాగమైన చిత్రాల్లో ఇంత మోడ్రన్‌గా కనిపించలేదు. అందుకే ప్రారంభంలో ఈ చిత్రంలో నటించడం గురించి నేను తీసుకున్న నిర్ణయం సరైందా? కాదా? అనే సందేహం ఉండేది. కానీ అదే సమయంలో ఇంతక ముందెప్పుడూ ఇలాంటి పాత్రలో చేయలేదు కాబట్టి.. ఇందులో నటించాను" అని చెప్పింది. హీరోయిన్ రష్మిక నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'మైసా'. ఫస్ట్‌లుక్ పోస్టర్‌తోనే సినిమాపై అంచనాలు పెంచేశారు. అయితే ఈ సినిమాకు సంబంధిచి ఓ వార్త సోషల్‌మీడియాలో వైరల్ అవుతోంది, ఈ సినిమా కోసం రష్మిక ఓ భారీ యాక్షన్ సన్నివేశంలో ఎలాంటి డూప్ లేకుండా చేసిందని డైరెక్టర్ రవీంద్ర పుల్లె చెప్పారు. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆయన ఈ విషయాలను వెల్లడించారు.




# 'నటనను వదిలేద్దామనుకుంటున్నా..!




"గత పదేళ్లుగా నాకు నటనను మానేయాలని అనిపిస్తూనే ఉంది. కానీసరిగ్గా ఆసమయంలోనే ఏదో ఒక పాత్ర నా ఖాతాలో వచ్చి చేరు తుంద"ని అంటున్నారు హిందీ నటుడు మనోజ్ బాజ్‌పేయి. 'గ్యాంగ్స్ ఆఫ్ వాస్సేపూర్', 'ఇన్‌స్పెక్టర్ జెండే', 'ది ఫ్యామిలీ మ్యాన్' లాంటి ఎన్నో అలరించే కథల్లో నటించి అభిమానుల్ని సంపాదించు కున్నారీయ న. వైవిధ్యమైన పాత్రలతో మెప్పించిన ఆయన... 'గవర్నర్' సినిమాతో తెరపైకి రావడానికి సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మనోజ్.. తన సినీప్రయాణం గురించి కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకున్నారు. "మీరు సంవత్సరాల తరబడి సీరియస్, మానసికంగా అలసిపోయే పాత్రలు పోషించినప్పుడు మీ స్వభావం చాలా చిరాకుగా మారుతుంది. మీ మూడ్ స్వింగ్స్ కూడా పెరుగుతాయి. దీని వల్లే నేను నటనను వది లేయాలని చాలాసార్లు అనుకున్నా. కానీ మళ్లీ మరో అవకాశంతో కెమెరా ముందు నిలబడాల్సివస్తోంది. జీవనోపాధి కోసమో.. నా కుటుంబాన్ని పోషించా లనే బాధ్యతతోనో.. ఇలా కేవలం తప్పనిసరి పరిస్థితుల్లో నటించడం నాకిష్టం లేదు. ఏదైనా ఒక పాత్ర పోషిస్తే.. అది నాకు నిజంగా ఆనందాన్ని, సంతృప్తిని ఇస్తుందని అనిపించినప్పుడు మాత్రమే నేను నటించాలనుకు ంటాను. నటనను డబ్బు, అవసరం కోసం కాకుండా.. అభిరుచితో చేయాలనుకుంటున్నా". ఇదే నాకు విముక్తి "ఇప్పటి వరకు ఎన్నో చిత్రాల్లో చాలా గంభీరమైన పాత్రలు చేశాను. అవన్నీ నా మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపాయి. ఇలాంటి పాత్రలు పోషించడం అంత సులభం కాదు. నేను మానసికంగా, శారీరకంగా వాటిలో పూర్తిగా లీనమైపోయేవాణ్ని. కానీ ఇప్పుడు నేను ఈ వలయం నుంచి బయటపడాలనుకుంటున్నా. తేలికపాటి.. కమర్షియల్ సినిమా లు చేయాలనుకుంటున్నా. అందులో ఎలాంటి సన్నాహాలు ఉండవు. కేవలం పాటలు, డ్యాన్స్, వినోదం మాత్రమే ఉంటాయి. పూర్తిస్థాయి కామెడీ చిత్రంలో కూడా నటించాలని కోరుకుంటున్నా.

ఇలాంటి కథల్లో భాగమైతే.. ఇంట్లో ఎలాంటి సన్నాహాలు చేసుకోకుండా సెట్‌కు రావచ్చు. మీరు ఏ పాత్ర చేస్తున్నారో కూడా ఆలోచించకుండా సెట్‌లో సరదాగా గడపచ్చు. నేను ఇన్నాళ్లుగా చేస్తున్న పనులన్నింటి నుంచి ఇదే నాకు విముక్తి". ఆ బాధ ఇప్పటికీ వెంటాడుతోంది "నా సినీప్రయాణంలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నాను. నా కష్టానికి ఫలితాన్ని కూడా పొందాను. కానీ దాని కోసం భారీ మూల్యం చెల్లించాల్సి వచ్చి ంది. సినిమాలతో బిజీగా గడపడం వల్ల నా తల్లిదండ్రులకు తగినంత సమయం కేటాయించలేకపోయా. చదువు కోసం మా గ్రామం నుంచి బోర్డింగ్ పాఠశాలకు మారడం, ఆ తర్వాత కెరీర్ కోసం ఢిల్లీ, ముంబయి లలో నివసించడం వల్ల కుటుంబానికి నాకు మధ్య దూరం పెరిగింది. ఆ బాధ ఈ రోజుకీ నన్ను వెంటాడుతోంది. నాలక్ష్యం.. బంగ్లా, ఖరీదైన వాచీలు ధరించడం కాదు. నాకు నచ్చిన పాత్రలను ఎంచుకునే స్వేచ్ఛను కలిగి ఉండాలి. అదే నా కోరిక". ప్రారంభంలో నాపై నాకే సందేహం "కెరీర్ ప్రారంభ రోజుల్లో ఎన్నో తిరస్కరణలను ఎదుర్కోవలసి వచ్చింది. అది నా జీవితంలోనే అత్యంత కష్టమైన సమయం.

నేను నిజంగా బాగా నటించగలనా? ఇలా నాపై నాకే సందేహం రావడం మొదలైంది. ఆ సమయంలో డబ్బు సమస్య ఉండేది. నేను ఎప్పుడూఅనారోగ్యానికి గురయ్యేవాణ్ని. ఇలానే నేను సెట్‌కు వెళ్లినప్పు డు.. నన్ను తిట్టి బయటకు గెంటేసిన రోజులున్నాయి. నేను పరిశ్రమకు చెందిన వ్యక్తిని కాదు. కానీ ఎంతో పోరాటం, పట్టుదలతో చివరికి ఈరోజు నాకంటూ ఒక స్థానాన్ని సంపాదించుకున్నా".

# రామ్ పోతినేని దర్శకత్వంలో సినిమా..

## కెమెరామెన్‌గా జాతీయ అవార్డు గ్రహీత తిరు..!




టాలీవుడ్ హీరో రామ్ పోతినేని త్వరలో ఒక సరికొత్త అవతారంలో కనిపించబోతున్నారు. ఆయన హీరోగా నటిస్తూ, స్వయంగా కథ-స్క్రీన్‌ప్లే రాసి, దర్శకత్వం వహిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'రాపో 23' ఈ సినిమాపై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. అయితే ఇప్పుడు ఈ ప్రాజెక్ట్‌లోకి జాతీయ అవార్డు గ్రహీత, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ (కెమెరామెన్) తిరు అధికారికంగా ఎంట్రీ ఇచ్చారు. గతంలో ఆయన 'క్రిష్ 3', 'జనతా గ్యారేజ్','గేమ్ ఛేంజర్' వంటి పెద్ద సినిమాలకు అద్భుతమైన విజువల్స్ అందించారు. ఇప్పుడు రామ్ తెరకెక్కించబోయే ఈ సరికొత్త 'నియో-నోయిర్' క్రైమ్ డ్రామాను కూడా తిరు తన కెమెరా మాయాజాలంతో మరింత అందంగా చూపించబోతున్నారు.

రామ్ పోతినేని మార్క్ యాక్షన్, ఎమోషన్స్ ఉన్న ఈ కథను తిరు తన విజువల్స్‌తో నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లనున్నారు. ఒకవైపు హీరోగా నటిస్తూనే, మరోవైపు కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం బాధ్యతలను రామ్ ఒక్కడే చూసుకోవడం విశేషం. ఈ సినిమాను 'రాపో సినిమాటిక్స్' బ్యానర్‌పై రామ్ సోదరుడు కృష్ణ పోతినేని భారీ బడ్జెట్‌తో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. రామ్ మొదటిసారి మెగాఫోన్ పట్టి దర్శకత్వం వహిస్తుండటం, దానికి తోడు తిరు లాంటి స్టార్ టెక్నీషియన్ తోడవడంతో ఈ సినిమాపై టాలీవుడ్‌లో అంచనాలుఆకాశాన్ని తాకుతున్నాయి.

# 'రామాయణ'లో కాజల్..

# ఆసక్తిగా ఉందన్న నటి..!

సినీప్రియులందరి దృష్టి ప్రస్తుతం 'రామాయణ' మీదే ఉంది. బాలీవుడ్‌లో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా రూపొందుతోన్న ఈ సినిమాలో రణ్‌బీర్ కపూర్.. రాముడి పాత్రలో, సీతగా సాయి పల్లవి నటిస్తున్న సంగతి తెలిసిందే. నితేశ్ తివారీ దర్శకత్వం వహిస్తున్నారు. విలక్షణ నటుడు యశ్.. రావణు డిగా కనిపించను న్నారు. ఆయన సతీమణి మండోదరి పాత్రలో కాజల్ నటించనున్నట్లు ఎప్పటినుంచో వార్తలు వస్తున్నాయి. తాజాగా ఆమె ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించారు. ఓ అవార్డు వేడుకకు హాజరైన కాజల్ ఈ సినిమా గురించి మాట్లాడారు. తన కెరీర్లోనే ఇలాంటి బిగ్ ప్రాజెక్ట్ చేయడం మొదటిసారి అని అన్నారు. సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. విలక్షణ నటుడు యశ్.. రావణుడిగా కనిపించనున్నారు. ఆయన సతీమణి మండోదరి పాత్రలో కాజల్ నటించనున్నట్లు ఎప్పటినుంచో వార్తలు వస్తున్నాయి. తాజాగా ఆమె ఈ విషయాన్ని అధికారి కంగా వెల్లడించారు. జాన్వీకపూర్‌ను ట్రోల్ చేయొద్దు: జగప తి బాబు రిక్వెస్ట్ భారీ స్థాయిలో 'రామాయణ' రానుంది. గతంతో నితేశ్ తివారీఈ చిత్రం గురించి మాట్లాడుతూ.. "5000 సంవత్సరాలకు పైగా కోట్లాది హృదయాలను పాలిస్తున్న ఈ ఇతిహాసాన్ని తెర పైకి తీసుకురావడానికి దశాబ్దం నుంచి అన్వేషణ ప్రారంభించాం. మా చిత్రబృందం ఈ చిత్రం కోసం విశ్రాంతి తీసుకోకుండా పనిచేస్తూనే ఉంది. 2026 దీపావళికి మొదటి భాగం, 2027 దీపావళికి రెండో భాగాన్ని విడుదల చేయబోతున్నాం" అని అన్నారు. ఈ ఏడాది దీపావళికి మొదటి భాగం విడుదల కానుంది.



# 'దూత 2' ప్రారంభం



ప్రియ భవానీ శంకర్, నాగచైతన్య, నాగార్జున, విక్రమ్ కె.కుమార్, శరత్‌మరార్ కథానాయకుడు నాగచైతన్య 'దూత' సిరీస్‌తో ఓటీటీ రంగ ప్రవేశం చేశారు. అమె జాన్ ప్రైమ్ వీడియోలో ఈ సిరీస్ విడుదలై ఘన విజ యం సాధించింది. నాగచైతన్య ఈసారి శరత్‌మరా ర్‌తో కలిసి ఈ సిరీస్ నిర్మాణ బాధ్యతల్ని కూడా నిర్వర్తించనున్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఈ సిరీస్ చిత్రీకరణ ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి కథానాయకుడు నాగార్జున క్లాప్‌నిచ్చి, సిరీస్ బృందా నికి స్క్రిప్ట్‌ని అందజేశారు. ప్రారంభోత్సవానికి సంబం ధించిన చిత్రాల్ని నాగచైతన్య సూపర్ నేచురల్ థ్రిల్లర్‌గా తొలి భాగాన్ని తెరకెక్కించిన దర్శకుడు విక్రమ్ కె.కుమార్ ఈసారి మరింత ఉత్కంఠ, మిస్టరీతో కూడిన కథని సిద్ధం చేశారని నిర్మాణ వర్గాలు తెలిపాయి.




Edited, Printed, Published & Owned by PUSALA SRINIVAS, Printed at D.K. Publications,2-3-691/1/A CPL Main Road, Amberpet, Hyderabad and Published # Do.No. 2-2-1075/20/E/1, Opp. Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13. Editor : PUSALA SRINIVAS, RNI. NO. APTEL/2008/26737. Cell: 9603754136, 9949653944 E-mail: dkchaatimpu80@gmail.com